




# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 264 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | సోమవారం 15 జూన్ 2026 | పేజీలు : 12 | వెల : 2/-


### సింగపూర్‌లో సీఎం చంద్రబాబుకు
# ఘన స్వాగతం పలికిన తెలుగు ప్రజలు



**రెండు రోజుల పర్యటన కోసం సింగపూర్ చేరుకున్న సీఎం**
**కుటుంబాలతో తరలివచ్చి అభిమానం చాటుకున్న ప్రవాసులు**
**అందరినీ ఆప్యాయంగా పలకరించి ఫోటోలు దిగిన చంద్రబాబు**
**తెలుగు ప్రజలు చూపిన ప్రేమ ఎంతో ఆనందాన్నిచ్చిందని వెల్లడి**

**సింపూర్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రెండు రోజుల (జూన్ 15, 16) పర్యటన నిమిత్తం సింగపూర్ చేరుకున్నారు. ఈ సందర్భంగా అక్కడి తెలుగు ప్రజలు, ప్రవాస భారతీయులు (ఎన్‌ఆర్‌ఐలు) ఆయనకు అపూర్వ రీతిలో ఘన స్వాగతం పలికారు. చంద్రబాబు రాక గురించి తెలుసుకున్న తెలుగు ఎన్‌ఆర్‌ఐలు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో విమానాశ్రయానికి తరలివచ్చారు. ముఖ్యమంత్రి పట్ల తమ అభిమానాన్ని చాటుకుంటూ సందడి చేశారు. వారి ఆప్యాయతకు స్పందించిన చంద్రబాబు, ప్రతి ఒక్కరినీ పేరుపేరునా పలకరిస్తూ, వారితో కలిసి ఫోటోలు దిగారు. ఈ సందర్భంగా చంద్రబాబు తనను కలవడానికి వచ్చిన తెలుగు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. "నాకు, నా బృందానికి ఘన స్వాగతం పలికిన తెలుగు ప్రజలందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. మీరు మీ కుటుంబాలతో కలిసి వచ్చి చూపిన ప్రేమ, ఆప్యాయత నాకు ఎంతో మిగతా .. 2లో..

# నేడు ఢిల్లీలో జనసేన సమావేశం

- 'సేన ప్రస్థానం... జాతీయ సమగ్రత కోసం..' అనే విధానంపై నాయకులకు దిశానిర్దేశం చేయనున్న పవన్ కళ్యాణ్
- ఢిల్లీ విమానాశ్రయంలో పవన్‌కు ఘన స్వాగతం



**విశ్వం వాయిస్ న్యూస్ :** జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం నాడు పార్టీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ప్రాంతీయతను విస్మరించని జాతీయ వాదం, భాషలను గౌరవించే సంప్రదాయం, సంస్కృతులను కాపాడే సమాజం... లాంటి సిద్ధాంతాలను పుణికి పుచ్చుకున్న జనసేన పార్టీ జాతీయ సమగ్రత దృక్పథంతో " సేన ప్రస్థానం... జాతీయ సమైక్యత కోసం.. అనే శీర్షికతో మిగతా .. 2లో..

### భారత డీఎన్‌ఏలోనే
# ఇన్నోవేషన్ ఉంది
ప్రధాని నరేంద్ర మోదీ



**విశ్వం వాయిస్ న్యూస్ :** భారత డీఎన్‌ఏలోనే ఇన్నోవేషన్ ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఫ్రాన్స్ పర్యటనలో భాగంగా నీస్ నగరంలో నిర్వహించిన 'భారత్ ఇన్నోవేట్స్' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సుస్థిర భవిష్యత్తు, ప్రపంచం మేలు కోసం భారత్ ఆవిష్కరణలు మిగతా .. 2లో..

### ఎవరూ
# దాడులు చేసుకోవద్దు
డొనాల్డ్ ట్రంప్ హితవు



**విశ్వం వాయిస్ న్యూస్ :** లెబనాన్‌లోని బీరుట్‌పై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తప్పుబట్టారు. ఇరుపక్షాలు స్వీయ నియంత్రణ పాటించాలని ఆయన కోరారు. ఇరాన్‌తో శాంతి ఒప్పంద చర్చలు సమీపిస్తున్న తరుణంలో బీరుట్‌పై ఈ దాడి జరిగి ఉండాల్సింది కాదంటూ తన సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్‌లో మిగతా .. 2లో..

### అమరావతి పనులు ఆగలేదు..
# జోరుగా సాగుతున్నాయి

**వర్షం వస్తే పనులు ఆగిపోతాయన్న వార్తలను ఖండించిన మంత్రి లోకేష్**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో నిర్మాణ పనులు శరవేగంగా, ఎక్కడా విరామం లేకుండా కొనసాగుతున్నాయని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. రాజధాని పనులు ఆగిపోయాయని, చిన్న వర్షానికే మునిగిపోతోందని కొందరు చేస్తున్న విష ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు నిర్మాణ పనుల పురోగతిని చూపిస్తూ ఆయన తన 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో ఒక వీడియోను పోస్ట్ చేశారు. "అమరావతిలో పనులు ఏమాత్రం ఆగడం లేదు. వర్షం కురిస్తే మునిగిపోయిందంటూ కొందరు ప్రచారం చేస్తున్నారు. కానీ, నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి. రాజధానిలో ఐకానిక్ టవర్లు, అసెంబ్లీ, హైకోర్టు, ప్రధాన రహదారులు, రిజర్వాయర్ల పనులు వేగంగా జరుగుతున్నాయి. వీటితో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం మిగతా .. 2లో..

# కారు-బొలెరో ఢీ..
**ఒకరి మృతి, 20 మందికి గాయాలు**



**యర్రగొండపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** మార్కాపురం జిల్లాలో ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. కారు, బొలెరో ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ మహిళ మృతి చెందగా, 20 మందికి గాయాలయ్యాయి. యర్రగొండపాలెం నుంచి మార్కాపురం వెళ్లే మార్గంలో లక్ష్మీవెంకటేశ్వర దాబా వద్ద ఈ ప్రమాదం మిగతా .. 2లో..

### మా ఫేస్‌బుక్ పేజీని
# బ్లాక్ చేశారు

**కూటమి ప్రభుత్వంపై జగన్ ఆగ్రహం**



**తాడేపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** వైసీపీ అధినేత జగన్ ఏపీ కూటమి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తమ పార్టీ అధికారిక ఫేస్‌బుక్ పేజీని భారతదేశంలో కనిపించకుండా చేశారని, ఇది ప్రతిపక్షాల గొంతు నొక్కే చర్యేనని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను, అవినీతిని ప్రశ్నిస్తున్నందుకే కక్షపూరితంగా ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఈ ఏడాది ప్రారంభంలో తమ పార్టీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను తొలగించారని, ఇప్పుడు ఫేస్‌బుక్ పేజీని లక్ష్యంగా చేసుకున్నారని జగన్ ఒక ప్రకటనలో తెలిపారు. "ఇది కేవలం మిగతా .. 2లో..

### వైకాపా హయాంలో
# దొంగ ఓట్ల నమోదు
పీవీఎన్ మాధవ్



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** గత వైకాపా ప్రభుత్వ హయాంలో భారీగా దొంగ ఓట్లు నమోదయ్యాయని, వాటిని తొలగించాలని ఏపీ భాజపా అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. ఏపీ భాజపా యువ మోర్చా రాష్ట్ర సమావేశం విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి మాధవ్ హాజరై మిగతా .. 2లో..

### పల్నాడు జిల్లాలో
# ఘోర పడవ ప్రమాదం

- కృష్ణా నదిలో పడవ బోల్తా పడి నలుగురి మృతి
- బంధువుల ఇంటి వేడుకకు వెళ్లి తిరిగొస్తుండగా ఘటన
- పడవలో ఉన్న 10 మందిలో ఇద్దరు మృతి, ఇద్దరు గల్లంతు
- ఆరుగురిని సురక్షితంగా కాపాడిన స్థానికులు
- గల్లంతైన వారి కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలు



**అచ్చంపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీలోని పల్నాడు జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. అచ్చంపేట మండలం, కోనూరు గ్రామం వద్ద కృష్ణా నదిలో ఓ పడవ బోల్తా పడిన ఘటనలో నలుగురు మృతి చెందారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులు ఉన్నారు. మృతులను గంధం సంధ్య (9), గంధం సైనీ (10), బత్తుల కార్తీక్ (12), కొనత చైతన్య (28)గా గుర్తించారు. 10 మంది బంధువులు కోనూరులో జరిగే ఓ వేడుకకు పడవపై వెళ్లి హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో నదిలో పడవ బోల్తా పడటంతో వారంతా నీట మునిగిపోయారు. వీరిలో ఆరుగురిని గ్రామస్థులు కాపాడారు. మిగిలిన నలుగురు గల్లంతయ్యారు. పోలీసులు, గ్రామస్థులు గాలింపు చర్యలు చేపట్టగా.. వారి మృతదేహాలు లభ్యమయ్యాయి. వివరాల్లోకి వెళితే, కోనూరు గ్రామంలోని కుంకలగుంట గంగయ్య అనే వ్యక్తి ఇంటికి బంధువులు మిగతా .. 2లో..

### చిన్నారి జ్ఞానేశ్వరి కోసం
# రంగంలోకి ఎన్డీఆర్ఎఫ్

**పెంపుడు కుక్క మృతితో కొనసాగుతున్న మిస్టరీ**
**ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో రంగంలోకి దిగిన ఎన్డీఆర్ఎఫ్**
**పాప ఆచూకీ తెలిపిన వారికి లక్ష రూపాయల రివార్డు ప్రకటించిన అధికారులు**
**400 మంది సిబ్బంది, డ్రోన్లతో అటవీ ప్రాంతంలో కొనసాగుతున్న గాలింపు**



**తుని, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లాలో అదృశ్యమైన రెండేళ్ల చిన్నారి సుంకర జ్ఞానేశ్వరి ఆచూకీ కోసం గాలింపు చర్యలు మరింత ముమ్మరమయ్యాయి. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్) బృందాలు కూడా రంగంలోకి దిగాయి. ఇప్పటికే ఎస్డీఆర్ఎఫ్, పోలీస్, అటవీ, రెవెన్యూ, అగ్నిమాపక శాఖలకు చెందిన 400 మంది సిబ్బంది గాలింపులో పాల్గొంటున్నారు. తుని మండలం సిహెచ్ అగ్రహారంలోని పామాయిల్ తోటలో జూన్ 6న చిన్నారి జ్ఞానేశ్వరి తప్పిపోయింది. తోటలో పనిచేసే తల్లిదండ్రులు గణేశ్, భవానీ మధ్య సమన్వయ లోపం కారణంగా మిగతా .. 2లో..


# నేటి నుంచి పాపికొండల యాత్ర నిలిపివేత



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీలోని పాపికొండల యాత్ర నేటి నుంచి తాత్కాలికంగా నిలిచిపోనుంది. తనిఖీల దృష్ట్యా పర్యాటక బోట్లను నిలిపేస్తున్నట్లు రంపచోడవరం ఆర్డీఓ స్వాతి తెలిపారు. దీంతో ఒక ఏపీ టూరిజం, 15 ప్రైవేట్ బోట్లు నిలిచిపోనున్నాయి. ఇటీవల దేవీపట్నం వద్ద 89 మంది పర్యాటకులతో బయల్దేరిన బోటు గోదావరి మధ్యలో సాంకేతిక లోపాలతో నిలిచిపోయింది. ఐతే తరచూ మిగతా .. 2లో..

### తిరుమలలో జనసేన కార్యకర్తలు
# నిబంధనలు ఉల్లంఘన

**'పవన్ కల్యాణ్ అనే నేను' పుస్తకంతో రీల్స్, వీడియోల చిత్రీకరణ**
**సోషల్ మీడియాలో వీడియో వైరల్.. భక్తుల నుంచి తీవ్ర ఆగ్రహం**
**టీటీడీ కఠిన చర్యలు తీసుకోవాలని నెటిజన్ల డిమాండ్**
**కొండపై రాజకీయ ప్రచారాలపై నిషేధం ఉందని గుర్తుచేస్తున్న భక్తులు**




**తిరుమల, విశ్వం వాయిస్ న్యూస్ :** కలియుగ వైకుంఠం, కోట్లాది మంది భక్తుల ఆరాధ్య దైవం కొలువైన తిరుమల క్షేత్రంలో కొందరు జనసేన కార్యకర్తలు, పవన్ కల్యాణ్ అభిమానులు ప్రదర్శించిన అత్యుత్సాహం తీవ్ర వివాదాస్పదంగా మారింది. అత్యంత పవిత్రంగా భావించే శ్రీవారి ఆలయ సమీపంలో నిబంధనలను బేఖాతరు చేస్తూ రాజకీయ ప్రచారానికి పాల్పడటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. కొందరు జనసేన కార్యకర్తలు తిరుమల శ్రీవారి ఆలయ సమీపంలో 'పవన్ కల్యాణ్ అనే నేను' అనే పుస్తకాన్ని ప్రదర్శిస్తూ వీడియో రీల్స్ చిత్రీకరించారు. ఈ పుస్తకాన్ని మిగతా .. 2లో..

### పశ్చిమాసియా సంక్షోభంలోనూ
# దేశం ప్రగతి పథంలో..

**కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్**



**విశ్వం వాయిస్ న్యూస్ :** దేశ ఆర్థిక వ్యవస్థ, కుటుంబాల సంక్షేమం విషయంలో తాము చూపిస్తున్న శ్రద్ధను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గుర్తించలేకపోతున్నారని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఆయన లోక్‌సభలో మాట్లాడిన ప్రతిసారీ కేవలం విమర్శలకే పరిమితమవుతారని వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ, కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకునే క్రమంలో.. దేశం సాధించిన విజయాలను ఆయన తక్కువ చేసి చూపిస్తున్నారని ధ్వజమెత్తారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో వికసిత్ భారత్ సంకల్ప సమావేశంలో కేంద్రమంత్రి పాల్గొని ఈమేరకు ప్రసంగించారు. "భారీ విపత్తు ముంచుకొస్తోందని, రాబోయే కొద్ది వారాల్లో అంతా కుప్పకూలిపోతుందని రాహుల్ గాంధీ తరచూ అంటుంటారు. ఆయన చెబుతున్నట్లుగా దేశంలో ఎటువంటి మిగతా .. 2లో..

### దీప్తి శర్మ స్పిన్ మాయ.. పాక్ 106 ఆలౌట్..
# భారత్ ఘన విజయం



**ఎడ్జ్‌బాస్టన్, విశ్వం వాయిస్ న్యూస్ :** టీ20 ప్రపంచ కప్ 2026లో భారత్ శుభారంభం చేసింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమ్ ఇండియా 64 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

### సింగపూర్‌లో చంద్రబాబుకు

# ఘనస్వాగతం పలికిన తెలుగు ప్రజలు

ఆనందాన్నిచ్చాయి. మీ అందరితో మాట్లాడటం నాకు చాలా సంతోషాన్ని కలిగించింది. మీలో ప్రతి ఒక్కరి మద్దతును ఎప్పటికీ మరువలేను" అని చంద్రబాబు పేర్కొన్నారు. రెండు రోజుల పాటు సింగపూర్‌లో జరగనున్న పలు అధికారిక కార్యక్రమాల్లో చంద్రబాబు పాల్గొననున్నారు.

# భారత డీఎన్ఏలోనే ఇన్నోవేషన్ ఉంది

చేస్తోందన్నారు. తమ దేశానికి చెందిన యువ ఆవిష్కర్తలు సమస్త మానవాళికి ప్రయోజనాలు చేకూర్చే పరిష్కారాలను కనుగొంటున్నారని తెలిపారు. "కృత్రిమ మేధ రంగంలో భారత్‌కు అపారమైన సామర్థ్యం ఉంది. మేం చేపట్టిన 'సంస్కరణల ఎక్స్‌ప్రెస్' ఆగదు.. అది నిరంతరం సాగుతూనే ఉంటుంది. మా దేశంలో 2 లక్షలకు పైగా స్టార్టప్‌లున్నాయి. ఇవి దేశంతోపాటు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకూ బలాన్నిస్తున్నాయి. మా దేశం ఆవిష్కరణలను వినియోగించుకునే దేశం మాత్రమే కాదు.. ఆ రంగానికి సహకారం అందించేదిగానూ ఆవిర్భవించింది" అని మోదీ పేర్కొన్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ మాట్లాడుతూ.. 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమాన్ని ప్రశంసించారు. తమ దేశం కూడా వివిధ రంగాల్లో ఇందులో భాగస్వామిగా ఉందన్నారు. భారత్‌ను 'ఆవిష్కరణల దేశం'గా పేర్కొన్నారు. ఏఐ, వాతావరణ మార్పుల వంటి కీలక రంగాల్లో ఇరుదేశాల మధ్య దృఢమైన భాగస్వామ్యం ఉందని చెప్పారు. పౌర అణుశక్తి రంగంలో ద్వైపాక్షిక సహకారాన్ని విస్తరించుకోవడానికి ఆస్కారం ఉందన్నారు.

# ఎవరూ దాడులు చేసుకోవద్దు

పోస్ట్ చేశారు. తనను తాను రక్షించుకునే హక్కు ఇజ్రాయెల్‌కు ఉందని ట్రంప్ అన్నారు. అయితే, ప్రత్యర్థి చేసిన దాడి చాలా చిన్నదని, దాని వల్ల ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని అభిప్రాయపడ్డారు. ఇజ్రాయెల్ ఇకపై లెబనాన్‌లో ఎక్కడా దాడులు చేయకూడదని హితవు పలికారు. అదే సమయంలో హెజ్‌బొల్లా సహా ఇతరులు కూడా ఇజ్రాయెల్‌పై దాడులకు దిగకూడదన్నారు. ప్రాంతీయ శాంతికి చేరువవుతున్న వేళ (ఒప్పందాన్ని ఉద్దేశించి) దాన్ని నాశనం చేయొద్దని హితవు పలికారు. ఇరాన్ మద్దతు గల హెజ్‌బొల్లా గ్రూపునకు పట్టున్న బీరుట్ దక్షిణ శివార్లలోని ఓ భవనంపై ఇజ్రాయెల్ దాడి చేసింది. ఈ నేపథ్యంలో ట్రంప్ నుంచి ఈ ప్రకటన వచ్చింది. మరోవైపు యుద్ధాన్ని ముగించే ఒప్పందం ఆదివారం కుదిరే అవకాశం ఉందని ట్రంప్ చెప్పినప్పటికీ.. దాని గురించి ఎలాంటి ప్రకటనా చేయలేదు.

# వైకాపా హయాంలో దొంగ ఓట్ల నమోదు

మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న ఎస్ఐఆర్‌లో యువ మోర్చా నాయకులు భాగస్వాములు కావాలని, బూత్ పరిధిలోని 250 కుటుంబాలను కలవాలని సూచించారు. దేశ వ్యతిరేక ఆలోచనలు కలిగిన గ్యాంగ్‌లు ఎక్కువయ్యాయని, అలాంటి వారి గురించి భయపడాల్సిన పని లేదని, అప్రమత్తంగా ఉండాలని మాధవ్ పిలుపునిచ్చారు. ఇటీవల ఒక కీటకాన్ని (కాక్రోచ్ జనతాపార్టీ) పెట్టి పార్టీ పెట్టారని, దాని వెనుక ఉన్న అదృశ్య శక్తులు, వారి ఆలోచనలన్నీ బహిర్గతమయ్యాయని పేర్కొన్నారు. ప్రధాని మోదీ పరిపాలన వేగాన్ని చూసి ఓర్వలేని కొందరు దేశాన్ని నాశనం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. యువ మోర్చా నాయకులు చేపట్టాల్సిన కార్యక్రమాలపై క్యాలెండర్‌ను రూపొందించుకోవాలని సూచించారు. ఏపీలో అధికార భాగస్వామ్యంలో ఉన్నప్పటికీ సామాజిక అంశాలపై సమస్యలు వస్తే గళమెత్తాలని సూచించారు. రానున్న రోజుల్లో తాటి చెట్టు ఉద్యమం చేయబోతున్నామని, సముద్రతీరం వెంబడి 10 లక్షల తాటిచెట్లు నాటేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

# నేటి నుంచి పాపికొండల యాత్ర నిలిపివేత

ఇలాంటి సమస్యలే వస్తుండటంతో బోట్ల భద్రత పై ఆరోపణలు వస్తున్నాయి. దీంతో తనిఖీలు చేయాలని అధికారులు నిర్ణయించారు.

### అమరావతి పనులు ఆగలేదు..

# జోరుగా సాగుతున్నాయి

నిర్మిస్తున్న టవర్లు, మంత్రుల బంగ్లాల నిర్మాణాలు కూడా చురుగ్గా సాగుతున్నాయి. ఇకనైనా విష ప్రచారాన్ని ఆపండి" అని చెప్పిన ఓ వీడియోను మంత్రి లోకేశ్ 'ఎక్స్' ద్వారా పంచుకున్నారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను వీడియో రూపంలో ప్రజల ముందు ఉంచి, అమరావతిపై జరుగుతున్న దుష్ప్రచారానికి మంత్రి లోకేశ్ గట్టిగా బదులిచ్చారు.

# కారు-బొలెరో ఢీ..

జరిగింది. మృతురాలిని రమణమ్మ (45)గా గుర్తించారు. ప్రయాణికుల్లో నారాయణరెడ్డి, దేవికి తీవ్రగాయాలయ్యాయి. ప్రస్తుతం వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. గాయపడిన మిగిలిన క్షతగాత్రులను కూడా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. తెలంగాణలోని ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం దుబ్బతండాకు చెందిన 17 మంది బొలెరో వాహనంలో పుల్లలచెరువు మండలం నరజాముల తండా సమీపాన ఉన్న మంత్రిస్వామి దేవాలయానికి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం వారు శ్రీశైలానికి బయల్దేరారు. అదే సమయంలో పల్నాడు జిల్లా మాచర్ల మండలం కొత్తపల్లికి చెందిన ఆరుగురు తిరుపతి నుంచి స్వస్థలానికి వెళ్తున్నారు. ఈ రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ప్రమాదం జరిగింది.

### మా ఫేస్‌బుక్ పేజీని

# బ్లాక్ చేశారు

వైసీపీపై జరిగిన దాడి కాదు. ప్రజాస్వామ్య విలువలు, భావప్రకటనా స్వేచ్ఛపై జరిగిన దాడి" అని ఆయన పేర్కొన్నారు. ఇలా ప్రతిపక్ష పార్టీ అధికారిక ఖాతాలను నిలిపివేయడం ప్రమాదకరమని, ఇది పూర్తిగా అప్రజాస్వామికమని అన్నారు. అమరావతి రాజధాని ఖర్చులు, డీఎస్సీ ప్రక్రియలో అవకతవకలు, టీటీడీ నెయ్యి టెండర్లు వంటి అంశాలపై ఆధారాలతో సహా అవినీతిని బయటపెడుతుండటంతోనే ప్రభుత్వం ఇలాంటి చర్యలకు దిగుతోందని జగన్ ఆరోపించారు. ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలపై న్యాయపరంగా, రాజ్యాంగబద్ధంగా పోరాడతామని ఆయన స్పష్టం చేశారు. బెదిరింపులు, సెన్సార్‌షిప్‌తో తమ గొంతును అణచివేయలేరని, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయడంలో వెనక్కి తగ్గేది లేదని తేల్చి చెప్పారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడేందుకు, తమ ఫేస్‌బుక్ పేజీని తక్షణమే పునరుద్ధరించాలని జగన్ డిమాండ్ చేశారు.

### పల్నాడు జిల్లాలో

# ఘోర పడవ ప్రమాదం

వేడుక కోసం వచ్చారు. అనంతరం, సరదాగా గడిపేందుకు 10 మంది కలిసి ఒక చిన్న పడవలో నదిలో షికారుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో పడవ అదుపుతప్పి ఒక్కసారిగా బోల్తా పడింది. దీంతో పడవలో ఉన్నవారంతా నీటిలో మునిగిపోయారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. వారు ఆరుగురిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చగలిగారు. మిగిలిన నలుగురు గల్లంతు కాగా, సమాచారం అందుకున్న రెస్క్యూ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. గాలింపు చర్యల్లో నలుగురి మృతదేహాలను వెలికితీశారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు విచారణ చేపట్టారు.

**పడవ ప్రమాదంపై చంద్రబాబు దిగ్భ్రాంతి... రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటన**

పల్నాడు జిల్లా కోనూరు సమీపంలో కృష్ణా నదిలో పడవ బోల్తా పడి నలుగురు మృతి చెందిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రస్తుతం సింగపూర్ పర్యటనలో ఉన్న ఆయన, ఈ దుర్ఘటన గురించి తెలిసిన వెంటనే జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులతో ఫోన్‌లో సమీక్ష నిర్వహించారు. మృతుల కుటుంబాలకు తక్షణ సహాయంగా రూ. 5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఈ ప్రమాదంపై రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ అధికారులతో కూడిన బృందంతో పూర్తి స్థాయి విచారణ జరిపించాలని సీఎం ఆదేశించారు. సహాయక చర్యలు, తదుపరి కార్యక్రమాలను పర్యవేక్షించే బాధ్యతను విపత్తు నిర్వహణ సంస్థ డైరెక్టర్ ప్రఖర్ జైన్, సమాచార శాఖ డైరెక్టర్ విశ్వనాథ్, జిల్లా కలెక్టర్‌కు అప్పగించారు. పడవలో ప్రయాణిస్తున్న మిగతా ఆరుగురు సురక్షితంగా ఉన్నారని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ప్రమాదానికి గల కారణాలను గుర్తించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని చంద్రబాబు అధికారులకు స్పష్టం చేశారు. బాధితుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.

### చిన్నారి జ్ఞానేశ్వరి కోసం

# రంగంలోకి ఎన్డీఆర్ఎఫ్

పాప అదృశ్యమైంది. ఆ రోజు సాయంత్రం ఒక గ్రామస్థుడు పాపను, దాని పెంపుడు కుక్కను కొండ సమీపంలో చూశాడు. పాపను తీసుకురావడానికి ప్రయత్నించగా, కుక్క అడ్డుకుంది. ఈ కేసులో కీలకమైన పెంపుడు కుక్క శనివారం మృతి చెందడంతో మిస్టరీ మరింత జఠిలంగా మారింది. జూన్ 9న ఒంటరిగా ఇంటికి తిరిగి వచ్చిన ఈ కుక్కకు, పోలీసులు జూన్ 12న జీపీఎస్ ట్రాకర్ అమర్చి పాప ఆచూకీ కనుగొనే ప్రయత్నం చేశారు. అయితే, ఆ కుక్క అనూహ్యంగా ప్రవర్తిస్తూ, ఆహారం తీసుకోకుండా దాదాపు 80 గంటల పాటు, 8 కిలోమీటర్లు తిరిగి ఇంటికి వచ్చాక మరణించింది. కుక్క మృతికి కారణం తెలుసుకునేందుకు అధికారులు పోస్టుమార్టంకు పంపించారు. ఈ ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, హోం మంత్రి వంగలపూడి అనిత ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తున్నారు. చిన్నారి ఆచూకీ తెలిపిన వారికి జిల్లా యంత్రాంగం లక్ష రూపాయల రివార్డు ప్రకటించింది. అత్యాధునిక డ్రోన్లు, 38 సీసీటీవీ కెమెరాల ఫుటేజీని విశ్లేషిస్తూ గాలింపు కొనసాగిస్తున్నామని కాకినాడ ఎస్పీ జి.బిందు మాధవ్ తెలిపారు.

### తిరుమలలో జనసేన కార్యకర్తలు

# నిబంధనలు ఉల్లంఘన

ప్రమోట్ చేసే ఉద్దేశంతో వారు ఈ చర్యకు పాల్పడ్డారు. ఆలయ పరిసరాల్లో మొబైల్ ఫోన్లు వాడటం, వీడియోలు తీయడం పూర్తిగా నిషేధం అని తెలిసినప్పటికీ, వారు ఈ నిబంధనలను ఉల్లంఘించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వేగంగా వైరల్ కావడంతో శ్రీవారి భక్తులు, నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తిరుమల పవిత్రతకు భంగం కలిగించేలా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**కఠిన నిబంధనలు ఉన్నప్పటికీ..**

తిరుమల కొండపై ఎలాంటి రాజకీయ కార్యకలాపాలకు తావులేదని టీటీడీ స్పష్టమైన నిబంధనలను అమలు చేస్తోంది. కొండపై రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, బ్యానర్లు, నినాదాలు, ప్రసంగాలు పూర్తిగా నిషేధం. దర్శనం అనంతరం మీడియాతో మాట్లాడేటప్పుడు కూడా రాజకీయ వ్యాఖ్యలు చేయరాదని ప్రముఖులకు సైతం టీటీడీ సూచిస్తుంటుంది. ఆలయ పవిత్రతను, ఆధ్యాత్మిక వాతావరణాన్ని కాపాడటమే ఈ నిబంధనల ముఖ్య ఉద్దేశం. అంతేగాక ఆలయ మాడ వీధులు, పరిసర ప్రాంతాల్లో సెల్‌ఫోన్ల వాడకం, ఫొటోలు, వీడియోల చిత్రీకరణపై కఠినమైన నిషేధం అమలులో ఉంది. టీటీడీ విజిలెన్స్ సిబ్బంది నిరంతరం నిఘా పెట్టినా, కొందరు యాత్రికులు నిబంధనలను అతిక్రమించి ఇలాంటి చర్యలకు పాల్పడటం ఆందోళన కలిగిస్తోంది. గతంలో కూడా ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు టీటీడీ కఠినంగా వ్యవహరించింది.

**టీటీడీ స్పందనపై సర్వత్రా ఆసక్తి**

తాజాగా జరిగిన ఈ ఘటన భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసింది. రాజకీయ అభిమానాన్ని ప్రదర్శించాల్సింది పవిత్ర పుణ్యక్షేత్రంలో కాదని, ఇలాంటి చర్యల వల్ల క్షేత్ర పవిత్రత మసకబారుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆధ్యాత్మిక వాతావరణానికి భంగం కలిగించిన ఈ వ్యక్తులపై టీటీడీ అధికారులు ఏ విధమైన చర్యలు తీసుకుంటారోనని అందరూ ఆసక్తిగా గమనిస్తున్నారు. ఈ ఘటనపై టీటీడీ అధికారికంగా స్పందించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు.

### పశ్చిమాసియా సంక్షోభంలోనూ

# దేశం ప్రగతి పథంలో..

సంక్షోభం లేదు. ఆర్థిక వ్యవస్థ ఏటికేడు అత్యంత వేగంగా వృద్ధి చెందుతోంది. జీడీపీ గణాంకాలూ దీనిని సూచిస్తున్నాయి. అంతర్జాతీయ ద్రవ్యనిధి కూడా ఇదే విషయాన్ని పేర్కొంది. అయినప్పటికీ.. భారత్ సంక్షోభంలో ఉందని ప్రజల్లో తప్పుడు అభిప్రాయం కలిగించేందుకు యత్నిస్తున్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలోనూ దేశం ప్రగతి పథంలో సాగుతోంది. ఇంధన సరఫరాలు నిరంతరాయంగా కొనసాగేలా ప్రధాని మోదీ చర్యలు తీసుకున్నారు. మోదీ నేతృత్వంలో భాజపా 12 ఏళ్ల పాలన.. అభివృద్ధి, సంక్షేమంతో సాగింది. 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. గ్రామీణ పారిశుద్ధ్య కార్యక్రమాల కింద 12 కోట్ల మరుగుదొడ్లను నిర్మించాం. ప్రస్తుతం దేశంలో 58 కోట్ల జన్‌ధన్ ఖాతాలు ఉన్నాయి. 144 కోట్ల ఆధార్‌లు, 125 కోట్ల మొబైల్ కనెక్షన్లు ఉన్నాయి. డిజిటల్ లావాదేవీలకు 'యూపీఐ' ఓ నమూనాగా మారింది" అని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.

### దీప్తి శర్మ స్పిన్ మాయ.. పాక్ 106 ఆలౌట్..

# భారత్ ఘన విజయం

170 పరుగులు చేసింది. దీప్తి శర్మ (5/10) స్పిన్ మాయాజాలంతో లక్ష్యఛేదనలో పాక్ 106 పరుగులకు కుప్పకూలింది. ఆ జట్టులో ఓపెనర్ మునీబా అలీ (41; 35 బంతుల్లో 5 ఫోర్లు) టాప్ స్కోరర్. గుల్ ఫెరోజా 12, అయేషా జాఫర్ 12, అలియా రియాజ్ 12 పరుగులు చేశారు. భారత బౌలర్లలో శ్రీ చరణి 3, షెఫాలి వర్మ ఒక వికెట్ పడగొట్టారు. 5 వికెట్లు తీసిన దీప్తి శర్మకు ప్లేయర్ ఆఫ్ ది అవార్డు వచ్చింది.

**విజృంభించిన దీప్తి శర్మ..**

171 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన పాక్ 38 పరుగుల వద్ద తొలి వికెట్ కోల్పోయింది. మూడో ఓవర్లో 3 ఫోర్లు, నాలుగో ఓవర్లో 2 ఫోర్లు బాది ఊపు మీదున్న మునీబా, గల్ ఫెరోజా జోడీని దీప్తి శర్మ విడదీసింది. భార్తీ ఫుల్మాలీ క్యాచ్ పట్టడంతో ఫెరోజా పెవిలియన్ చేరింది. అనంతరం వచ్చిన అయేషాను సైతం దీప్తి శర్మనే ఔట్ చేసింది. 5 పరుగుల వ్యవధిలో శ్రీచరణి బౌలింగ్‌లో సైరా జబీన్ క్యాచ్ ఔట్ అయింది. దీంతో 58 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి పాక్ కష్టాల్లో పడింది. 10 ఓవర్లు ముగిసే సరికి ఆ జట్టు 72/3 స్కోర్‌తో నిలిచింది. మునీబా అలీ, నటాలియా పర్వేజ్ జోడీ కుదురుకుంటున్న సమయంలో దాయాది జట్టుకు కోలుకోలేని దెబ్బ తగిలింది. దీప్తి శర్మ అద్భుతమైన డైరెక్ట్ త్రోతో అర్ధశతకం దిశగా పయనిస్తున్న ఓపెనర్ మునీబా రనౌట్ అయింది. 12వ ఓవర్లో ఫాతిమా సనాను షెఫాలీ వర్మ బోల్తా కొట్టించింది. ఆ తర్వాతి ఓవర్లో శ్రీచరణి బౌలింగ్‌లో నటాలియా పర్వేజ్.. హర్మన్‌ప్రీత్‌కు చిక్కింది. దీంతో 79 పరుగులకే ఆ జట్టు 6 వికెట్లు కోల్పోయి ఓటమి దిశగా పయనించింది. కాసేపటికే రమీన్ షమీమ్‌ను శ్రీచరణి పెవిలియన్ చేర్చింది. చివరలో దీప్తి శర్మ ఒకే ఓవర్‌లో మూడు వికెట్లు తీయడంతో పాక్ ఆలౌటైంది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన టీమ్‌ఇండియా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 170 పరుగులు చేసింది. స్మృతి మంధాన (68; 44 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్ ఆడింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (36; 35 బంతుల్లో) రాణించింది. చివర్లో రిచా ఘోష్ (34; 17 బంతుల్లో) దూకుడుగా ఆడింది.

# నేడు ఢిల్లీలో జనసేన సమావేశం

ఈ సమావేశాన్ని నిర్వహిస్తోంది. జనసేన పార్టీ స్థాపించి పుష్కర కాలమైంది. ఈ కాలంలో జాతీయ సమైక్యత కోసం జనసేన ప్రస్థానం ఏ విధంగా కొనసాగింది, జాతీయ సమైక్యతపై జనసేన ఎటువంటి భావజాలంతో పని చేస్తుందో పవన్ కళ్యాణ్ ఈ సమావేశంలో వివరించనున్నారు. జాతీయతకు కేంద్ర బిందువైన దేశ రాజధానిలో ఈ సమావేశం ఏర్పాటైంది. జనసేన తరఫున ఎన్నికైన ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నామినేట్ అయిన కార్పొరేషన్ ఛైర్మన్లు, ఇతర ముఖ్య నేతలు, తెలంగాణ నేతలు, కర్ణాటక, తమిళనాడు, కేరళం రాష్ట్రాల నుంచి ఇటీవల పార్టీ లో చేరిన సభ్యులను ఈ సమావేశానికి ఆహ్వానించారు. ప్రాంతీయతకు విలువ ఇస్తూనే జాతీయ సమగ్రత కోసం ఒక రాజకీయ పార్టీగా నిలబడాలి.. వర్తమాన పరిస్థితుల్లో సమైక్యంగా నిలవాల్సిన ఆవశ్యకతతోపాటు జాతీయ రాజకీయాలపై నాయకులకు శ్రీ పవన్ కళ్యాణ్ గారు దిశానిర్దేశం చేస్తారు. ఈ సమావేశానికి అవసరమైన ఏర్పాట్లను పార్టీ నేతలు ఢిల్లీలో పర్యవేక్షిస్తున్నారు. సోమవారం ఉదయం ఢిల్లీలో అశోక హోటల్లో ఈ సమావేశం మొదలై సాయంత్రం ముగుస్తుంది. సోమవారం నిర్వహించే సేన ప్రస్థానం... దేశ సమగ్రత కోసం కార్యక్రమంలో పాల్గొనేందుకు ఢిల్లీ చేరుకున్న జనసేన అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్. ఢిల్లీ విమానాశ్రయంలో పవన్ కళ్యాణ్ కి పార్టీ ఎంపీలు బాలశౌరి, ఉదయ్ శ్రీనివాస్, పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు ఘన స్వాగతం పలికారు.

# పేదరికం విద్యకు అడ్డు కాకూడదు

**విద్యావకాశాలను అందిపుచ్చుకుంటే ఉజ్వల భవిష్యత్తు - మైనారిటీలు అన్ని రంగాల్లో రాణించాలి**

**మైనారిటీల సంక్షేమానికి 'కూటమి' కృషి మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్**




**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** పేదరికం విద్యకు అడ్డు కాకూడదని, విద్యారంగంలో అమలవుతున్న అన్ని పథకాలను, అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే యువతకు ఉజ్వల భవిష్యత్తు ఏర్పడుతుందని మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. ఏపీ మైనారిటీ సంక్షేమ శాఖ, వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో పేదరికం విద్యకు అడ్డు కాకూడదనే ఉద్దేశ్యంతో ప్రవేశపెట్టిన తాలీమ్ -ఏ- హునర్ పథకం క్రింద ఉచిత కార్పోరేట్ రెసిడెన్షియల్ ఇంటర్ విద్యకు ఎంపికైన విద్యార్థులకు అడ్మిషన్ పత్రాలు అందజేత కార్యక్రమం ఆదివారం జరిగింది. విజయవాడ నగరంలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య వారి కళాక్షేత్రంలో వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా మంత్రి ఎన్ఎండి ఫరూక్, రాష్ట్ర మైనారిటీ వ్యవహారాల సలహాదారుడు ఎంఏ షరీఫ్, ఎంపీ కేశినేని చిన్ని, విజయవాడ ఈస్ట్ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్, ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫారూక్ శుబ్లి, మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ముస్తాక్ అహమ్మద్, నూర్ భాషా కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా, షేక్ కార్పొరేషన్ చైర్మన్ ముక్తియార్, పాఠశాల విద్యా కమీషనర్ తమీమ్ అన్సారియా, విజయవాడ ట్రాఫిక్ డీసీపీ శిరీన్ బేగం, మాజీ ఎం ఎల్ సి ఇక్బాల్, వక్ఫ్ బోర్డు సభ్యులు, ముతవల్లీలు, యు ట్యూబ్ ఇన్ఫ్లుయెన్సర్ సిరాజ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ ప్రసంగిస్తూ మైనారిటీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నదని అన్నారు. మైనారిటీ విద్యార్థులకు ఉన్నత విద్యాభ్యాసానికి అవసరమయ్యే అన్ని రకాల పథకాల అమలుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు, ఐటీఐ లు, పాలిటెక్నిక్ లు, హాస్టళ్లు,సీఈడియం ను ముఖ్యమంత్రి చంద్రబాబు మైనారిటీల విద్యాభ్యున్నతి కోసం ఏర్పాటు చేశారన్నారు. మైనారిటీ కుటుంబాల్లోని పేద, ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి ఇంటర్ విద్యను అందించేందుకు తాలీమ్-ఏ-హునర్ పథకం కింద నిర్వహించిన ప్రవేశ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా విశేష స్పందన లభించిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 7000 కు పైగా మైనారిటీ విద్యార్థులు ప్రవేశ పోటీ పరీక్షకు హాజరయ్యారని పేర్కొన్నారు. ఈ పరీక్షలో అత్యంత ప్రతిభ కనబరిచిన 250 మంది విద్యార్థులకు ఉచిత కార్పోరేట్ రెసిడెన్షియల్ ఇంటర్ విద్యను నీట్, ఐఐటీ జేఈఈ కోచింగ్ తో పాటు అందించడం జరుగుతుందన్నారు. డిగ్రీ,పీజీ, లతోపాటు వైద్య విద్య, సాంకేతిక విద్య, ఇతర జాతీయస్థాయి యూపీఎస్సీ పోటీ పరీక్షలు, గ్రూప్ -1 తదితర పరీక్షలకు ఇంటర్ స్థాయిలోనే గట్టి పునాది ఏర్పడడానికి అవకాశం ఉందని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. మైనారిటీలలో నిరక్షరాస్యత ఎక్కువగా ఉందని, ఈ విద్యావకాశాలను అందిపుచ్చుకుని అన్ని రంగాలలో వారు రాణించాల్సిన అవసరం, ఆవశ్యకత ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ఈ పథకాన్ని రూపొందించి అమలుచేస్తున్న వక్ఫ్ బోర్డు చైర్మన్ అజీజ్ ని ప్రశంసించారు. అనంతరం ఉచిత కార్పొరేట్ స్థాయి ఇంటర్ విద్యకు ఎంపికైన విద్యార్థులకు అడ్మిషన్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ, వక్ఫ్ బోర్డు అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

# ఎడిటర్ వాయిస్

## మోడీ పచ్చజెండా కోసం వెయిటింగ్!

ఉత్తరాంధ్రాలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు అన్ని పనులూ పూర్తి చేసుకుని ప్రారంభోత్సవం కోసం ఎదురు చూస్తోంది. మరి కొద్ది రోజులలో ఈ ఎయిర్ పోర్టు తన ఆపరేషన్స్ ని స్టార్ట్ చేయనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా ఈ ఎయిర్ పోర్టుని ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దాంతో ప్రధానమంత్రి కార్యాలయం వైపు అంతా చూస్తున్నారు.

**ఈ డేట్ మీదనే ఫోకస్ :** జూలై 5 డేట్ మీదనే రాష్ట్ర ప్రభుత్వం ఎక్కువగా దృష్టి పెట్టినట్లుగా తెలుస్తోంది. ఎందుకంటే జూలై 4న అల్లూరి సీతారామరాజు జయంతి. ఈ ఇంటర్నేషనల్ పోర్టుకు అల్లూరి పేరు పెట్టారు. దాంతో ఆయన స్ఫూర్తితో ప్రారంభించుకోబోయే ఈ పోర్టు ఒక రోజు అటు ఇటుగా ఆయన జయంతి వేళ శ్రీకారం చుట్టుకోవాలని ప్రభుత్వ వర్గాల అభిలాషగా ఉంది. దాంతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జూలై 5న ఎయిర్ పోర్టుని ప్రారంభించడానికి గల అవకాశాలను పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది. జూలై 5 డేట్ ని ఫిక్స్ చేస్తే బాగుంటుంది అన్నదే అందరి అభిప్రాయంగా ఉంది. ఇదిలా ఉంటే భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవం కోసం జూలై 5 తేదీని రాష్ట్ర ప్రభుత్వం కోరినట్లుగా చెబుతున్నారు. ఆ రోజున ప్రధాని చేతుల మీదుగా ప్రారంభోత్సవాన్ని ఘనంగా చేయాలని కూడా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ తేదీన తాము అన్ని ఏర్పాట్లు చేసుకుని సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి కార్యాలయానికి తెలిపింది. ఒక వేళ ఈ తేదీ ప్రధానికి కుదరదు అనుకుంటే వేరే పీఎంఓ సూచించే ఏ తేదీకైనా తాము సిద్ధంగా ఉన్నామని తెలిపింది.

**అతి పెద్ద గ్రీ ఫీల్డ్ ఎయిర్ పోర్టు :** ఇక భోగాపురం ఎయిర్ పోర్టు చూస్తే అతి పెద్ద గ్రీన్ ఫీల్డ్ గా నిర్మించారు. 2,200 ఎకరాలలో అయిదు వేల కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ విమానాశ్రయం ప్రారంభం అయితే ఉత్తరాంధ్రకే కాదు ఏపీకే కొత్త కళ వస్తుందని భావిస్తున్నరు. ఇక భోగాపురం విమానాశ్రయానికి సంబంధించి ప్రధాన రహదారి కారిడార్ల పనులు 98 శాతం మేర పూర్తి చేసినట్లుగా అధికారులు చెబుతున్నారు. ప్రారంభించిన వెంటనే విమానాశ్రయం తన కార్యకలాపాలకు పూర్తిగా సిద్ధంగా ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

**60 లక్షల మంది ప్రయాణీకులు :** ఇదిలా ఉంటే జీఎమ్మార్ గ్రూప్ ఈ విమానాశ్రయాన్ని నిర్మించింది. ఈ అంతర్జాతీయ విమానాశ్రయంగా నామకరణం చేయబడిన ఈ విమానాశ్రయంలో సంవత్సరానికి దాదాపు 60 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణిస్తారు అని అంచనా వేస్తున్నారు. 77 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించిన ఈ టెర్మినల్‌లో 40 చెక్-ఇన్ కౌంటర్లు 26 ఇమ్మిగ్రేషన్ కౌంటర్లు ఉంటాయి. ఇక భోగాపురం విమానాశ్రయం విజయనగరం జిల్లాకు అభివృద్ధి చోదకంగా పనిచేస్తుందని ఆ ప్రాంత వాసులు బలంగా నమ్ముతున్నారు. మరో వైపు చూస్తే శ్రీలంక, మలేషియా, థాయిలాండ్ వంటి తర దేశాలకు విమానాలను నడపడానికి చర్యలు తీసుకోవాలని పౌర విమానయాన మంత్రిత్వ శాఖను ఎయిర్ ట్రావెల్స్ అసోసియేషన్ ప్రతినిధులు తాజాగా కోరారు.



విశాఖపట్నం రాష్టంలోని ఇతర ప్రాంతాల నుండి ప్రయాణించే విమాన ప్రయాణికులపై భారాన్ని తగ్గించడానికి, దేశవ్యాప్తంగా ఉన్న ప్రసిద్ధ టాక్సీ బైక్ ఆపరేటర్లతో స్థిరమైన చార్జీలతో ఒప్పందాలు కుదుర్చుకోవాలని కూడా అసోసియేషన్ ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## రోడ్డు ప్రమాదం.. ఏపీకి చెందిన 20 మందికి గాయాలు



**బెంగళూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** కర్ణాటకలోని బెంగళూరు సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఏపీకి చెందిన 20 మందికి గాయాలయ్యాయి. శనివారం సాయంత్రం మార్కాపురం జిల్లా పామూరు నుంచి బెంగళూరు బయల్దేరిన ఉదయగిరి డిపోనకు చెందిన బస్సు ఆదివారం తెల్లవారుజామున 3.30 గంటలకు బెంగళూరు సమీపంలోని చింతామణి వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీ కొట్టింది. ఈ ఘటనలో బస్సులోని 20 మందికి గాయాలయ్యాయి. తీవ్ర గాయాలపాలైన 10 మందిని సమీప ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు, స్థానికులు సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాద తీవ్రతకు బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. ప్రమాద సమయంలో బస్సులో 40 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది.

## దూసుకొచ్చిన మృత్యువు.. చిన్నారితో సహా ముగ్గురి మృతి



**కొండపాక, విశ్వం వాయిస్ న్యూస్ :** సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దుద్దెడలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మతి స్థిమితంలేని ఓ వృద్ధమహిళ రహదారి దాటుతుండగా.. కారు వేగంగా దూసుకొచ్చింది. అమెను తప్పించే క్రమంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ఇంటిపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఇంటి వద్ద అరుగుపై కూర్చున్న లక్ష్మితో పాటు చిన్నారి సహస్ర, వృద్ధురాలు రాధవ్వ మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తులు కారును అక్కడే వదిలేసి పరారయ్యారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

## బావిలోకి దూసుకెళ్లిన వ్యాను.. 8 మంది మృతి



**విశ్వం వాయిస్ న్యూస్ :** మహారాష్ట్రలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సోలాపూర్ జిల్లాలో తాండుల్వాడి సమీపంలో పికప్ ట్రక్కు బావిలో పడిపోవడంతో 8 మంది మృతి చెందారు. మరో ఆరుగురు గాయపడ్డారు. వారిని స్థానిక ఆస్పత్రిలో చేర్పించారు. సాగర్ చౌగులే తన కుటుంబ సభ్యులతో కలిసి పికప్ ట్రక్కులో దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. మస్వద్ నుంచి పండర్‌పూర్ వెళుతుండగా దారిలో రోడ్డు పక్కనే ఉన్న వ్యవసాయ భూమిలోకి ట్రక్కు దూసుకెళ్లడంతో ఈ ప్రమాదం జరిగింది.

## విశాఖలో కాలి బూడిదైన ఏటీఎం..



**విశాఖపట్నం(వేపగుంట), విశ్వం వాయిస్ న్యూస్ :** విశాఖలోని ఓ భవనంలో ఉన్న ఏటీఎం గదిలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాద విషయం ఆ భవనంలో ఉన్నవారికి తెలియలేదు. కానీ, ఎక్కడో ముంబయిలో ఉన్న ఏటీఎంలను పర్యవేక్షించే సెంట్రల్ మానిటరింగ్ యూనిట్ (సీఎంయూ)కు ప్రమాద సంకేతం అందడంతో వారు అప్రమత్తమయ్యారు. దీంతో భారీ ప్రమాదం తప్పింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గంట్ల అప్పారావు అనే వ్యక్తికి నగరంలోని వేపగుంట రామాలయం సమీపంలో మూడంతస్తుల భవనం ఉంది. కింద మూడు దుకాణాలుండగా, వాటిలో రెండింటిని యాక్సిస్, యూనియన్ బ్యాంకుల ఏటీఎంలకు, మరొకటి ఫొటో స్టూడియోకు అద్దెకిచ్చారు. శనివారం తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో యాక్సిస్ బ్యాంకు ఏటీఎంలో మంటలు చెలరేగాయి. వెంటనే ముంబయిలోని ఏటీఎంలను పర్యవేక్షించే సెంట్రల్ మానిటరింగ్ యూనిట్‌కు ప్రమాద సంకేతం అందింది. అక్కడి వారు విశాఖలోని బ్యాంకు మేనేజర్‌ను అప్రమత్తం చేశారు. అగ్నిమాపక వాహనం వచ్చేలోపే యాక్సిస్ బ్యాంకు ఏటీఎం మొత్తం దగ్ధమైంది. యూనియన్ బ్యాంకు ఏటీఎం పైభాగం, విద్యుత్తు వైర్లు కాలిపోయాయి. పెందుర్తి సీఐ సతీశ్‌కుమార్ ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగి ఉంటుందన్నారు. ప్రమాద సమయానికి ఏటీఎంలో రూ.30 లక్షల వరకు నగదు ఉన్నట్లు సమాచారం.

## మెడికల్ షాపులో పట్టపగలే కాల్పులు

**విశ్వం వాయిస్ న్యూస్ :** చండీగఢ్‌లోని సెక్టార్-11 ప్రాంతంలో శనివారం కాల్పుల కలకలం రేపింది. 'శ్రీ కుమార్ మెడికోస్' అనే మెడికల్ షాపులోకి ముసుగులు ధరించిన ఇద్దరు దుండగులు చొరబడి కెమిస్ట్‌పై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన బాధితుడిని వెంటనే పీజీఐ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.కాల్పుల సమయంలో షాపులో ఉన్న కస్టమర్లు,సిబ్బంది ప్రాణభయంతో పరుగులు తీసిన దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

### ఫామ్‌హౌస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

## అనుమానాస్పద మృతి



**కొయ్యలగూడెం, విశ్వం వాయిస్ న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామ శివారులోని ఒక ఫామ్‌హౌస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడిని మంచిర్యాల జిల్లాకు చెందిన గుండ్ల మధు(27)గా గుర్తించారు. వీకెండ్ కావడంతో రామంతాపూర్‌లోని సాఫ్ట్‌వేర్ కంపెనీకి చెందిన 15 మంది ఉద్యోగులు నిన్న సాయంత్రం ఇక్కడ గెట్ టుగెదర్ పార్టీ నిర్వహించారు. అయితే మధు మృతిపై తండ్రి ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగంలోకి దిగారు.

## అమ్మాయితో ప్రేమ.. ఆంటీతో సహజీవనం..



**పాలకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** మన్యం జిల్లా పాలకొండలో మాజీ వాలంటీర్ బిడ్డిక ఉషారాణి (32) హత్య కేసులో నిందితుడు భువనేశ్వర్ను మరో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఉషారాణిని ప్రేమిస్తూనే, ఇద్దరు పిల్లలున్న స్టాఫ్ నర్సు కృపారాణితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. విషయం తెలిసి పెళ్లి చేసుకోవాలని ఉషారాణి ఒత్తిడి చేయడంతో.. కృపారాణి, తేజేశ్వరరావులతో కలిసి ఉషారాణికి నిద్రమాత్రలు కలిపిన కూల్డ్రింక్ ఇచ్చి, ఆమెను ఊపిరి ఆడకుండా చేసి చంపేశారు. చేతులను కట్టేసి అనంతరం మృతదేహాన్ని చెరువులో పడేశారు.

## భార్యను హతమార్చిన భర్త



**పెద్దపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** పెద్ద పల్లి జిల్లా అంతర్గాం పోలీస్ స్టేషన్ పరిధిలోని ముర్మూరు గ్రామంలో భర్త చేతిలో భార్య హతమైంది. నంది లక్ష్మి మీద అనుమానంతో... నిన్న అర్ధరాత్రి అమె భర్త రాయమల్లు గొడ్డలితో నరికి హత్య చేశాడు. ఘటనా స్థలాన్ని రామగుండం సిఐ కృష్ణ కుమార్, అంతర్గాం ఎస్ఐ వెంకట స్వామి పరిశీలన చేశారు...విచారణ చేపట్టారు. లక్ష్మి మృత దేహన్ని"ఖని" ప్రభుత్వ జనరల్ అసుపత్రి మార్చురీకి తరలించారు. వీరికి ముగ్గురు పిల్లలున్నారు.

### రోడ్డు ప్రమాదంలో

## ప్రాణాలు కోల్పోయిన డాక్టర్, సాఫ్ట్వేర్ ఇంజినీర్



**విశ్వం వాయిస్ న్యూస్ :** రోడ్డు ప్రమాదం ఓ డాక్టర్, మరో సాఫ్ట్వేర్ ఇంజినీర్ను బలితీసుకుంది. ఈ విషాద ఘటన జనగామ రఘునాథపల్లి గోవర్ధనగిరిలో శనివారం జరిగింది. హనుమకొండ నయీంనగర్కు చెందిన మహ్మద్ రహముద్దీన్ కుటుంబ సభ్యులు, బంధువులు కర్ణాటకలో వివాహ వేడుకకు హాజరై తిరిగి వస్తున్నారు. గోవర్ధనగిరి దర్గా సమీపానికి వచ్చాక కారు అదుపు తప్పి లోయలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో రహముద్దీన్ కూతురు డెంటిస్ట్ హబీబా హఫ్సా(27), బంధువైన సాఫ్ట్వేర్ మహ్మద్ అసదుద్దీన్ (26) మృతి చెందారు. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

### 8 మంది అరెస్టు, 36,500 నగుదు స్వాధీనం



**నూజివీడు, విశ్వం వాయిస్ న్యూస్ :** నూజివీడు డీఎస్పీ కెవివి ఎన్వి ప్రసాద్ యొక్క ఆదేశాలపై నూజివీడు రూరల్ ఇన్‌స్పెక్టర్ ఐ.వి.నాగేంద్ర కుమార్ ఆధ్వర్యంలో నూజివీడు రూరల్ ఎస్.ఐ జ్యోతి బాసుకి అందిన సమాచారంపై పోలీసులు దాడిని నిర్వహించారు. నూజివీడు రూరల్ మండలం, హనుమంతుల గూడెం గ్రామం ఈ రోజు అనగా 14.06.2026 దాడి చేయగా పేకాట ఆడుతున్న 08 మంది వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ. 36,500 నగదు మరియు 06 మోటార్ సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నూజివీడు రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లుగా నూజివీడు రూరల్ ఎస్ఐ జ్యోతిబసు తెలియచేసినారు.

# ఏఐ కోర్సులు చేస్తారా? ఉచితంగా అందించే వేదికలెన్నో..

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా మారు మోగుతోన్న పేరు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ). అన్ని రంగాల్లోనూ దీని ప్రాధాన్యం పెరుగుతోంది. నియామకాల్లో ఏఐ ప్రావీణ్యం ఉన్నవారిని ఎంపిక చేసుకోవడానికి సంస్థలూ ఆసక్తి చూపుతున్నాయి. అన్ని రంగాల్లోనూ దీన్ని విస్తృతంగా ఉపయోగించడమే దీనికి కారణం. అందువల్ల విద్యార్థులు, ఉద్యోగార్థులు ఏఐలో అవగాహన పెంచుకుంటే కొత్త అవకాశాలు అందిపుచ్చుకోవచ్చు. ఎన్నో వేదికల ద్వారా ఇప్పుడు ఏఐను ఎక్కడ నుంచైనా నేర్చుకోవచ్చు. టెక్నాలజీ వేగంగా అభివృద్ధి చెందుతున్న క్రమంలో ఏఐ, మెషీన్ లెర్నింగ్, జనరేటివ్ ఏఐ లాంటి అంశాలపై అవగాహన ఉండటం భవిష్యత్తు ఉద్యోగాలకు చాలా ఉపయోగం. ఉద్యోగాలు, పరిశోధనలు, స్టార్టప్‌లు అన్నీ ఏఐ ఆధారితంగానే ముందుకు సాగుతున్నాయి. అందువల్ల ఈ టెక్నాలజీ గురించి నేర్చుకోవడం తప్పనిసరి. ప్రపంచంలోని ప్రముఖ సంస్థలు, విశ్వవిద్యాలయాలు కొన్ని ఏఐ కోర్సులను ఉచితంగా అందిస్తున్నాయి.

**జనరేటివ్ ఏఐ**

జనరేటివ్ ఏఐ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోంది. టెక్స్ట్ రాయడం, కోడ్ జనరేట్ చేయడం, చాట్‌బాట్స్ రూపొందించడం, సంగీతం, చిత్రాలు లాంటి కొత్త కంటెంట్‌ను సృష్టించే సామర్థ్యం ఈ టెక్నాలజీకి ఉంది. విద్యార్థులు, ఉద్యోగార్థులు భవిష్యత్తు అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే జనరేటివ్ ఏఐ గురించి అవగాహన ఉండాలి. గూగుల్ క్లౌడ్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌లో ఈ కోర్సును ఉచితంగా నేర్చుకోవచ్చు. ప్రాక్టికల్ ల్యాబ్స్, ప్రాజెక్ట్స్ ద్వారా నేర్చుకునే వీలుంది. రియల్ టైమ్ ల్యాబ్స్ ద్వారా ప్రత్యక్ష అనుభవం, కోర్సు పూర్తిచేసిన తర్వాత సర్టిఫికెట్ పొందవచ్చు. ఈ టెక్నాలజీ విద్య, ఆరోగ్యం, మీడియా, వ్యాపారం లాంటి అనేక రంగాల్లో ఉపయోగపడుతోంది.

**ఏఐ ఫర్ బిగినర్స్**

ఏఐ గురించి నేర్చుకోవడానికి రూపొందించిన ప్రారంభ స్థాయి కోర్సు ఏఐ ఫర్ బిగినర్స్. ఇందులో ఏఐ అంటే ఏమిటి, అది ఎలా పనిచేస్తుంది, మెషీన్ లెర్నింగ్ బేసిక్స్, ప్రాక్టికల్ జనరేటివ్ ఏఐ ఉపయోగాలు తదితర అంశాల గురించి నేర్చుకోవచ్చు.




ప్రముఖ టెక్నాలజీ సంస్థ ఐబీఎమ్ ఈ కోర్సును రూపొందించింది. దీన్ని కోర్సెరా, మైక్రోసాఫ్ట్ ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా అందిస్తోంది. ఎలాంటి ఫీజు లేకుండా, సులభంగా ప్రాక్టికల్ ఉదాహరణలతో నేర్చుకునే అవకాశం కల్పిస్తోంది.

**రోబోటిక్స్/ మెషీన్ లెర్నింగ్**

మెషీన్ లెర్నింగ్‌లో అల్గారిథమ్స్, సిస్టమ్స్ థింకింగ్, ఏఐ సూత్రాలను బోధిస్తారు. ఏఐ పరిశోధన లేదా డెవలప్‌మెంట్ రంగంలో స్థిరపడాలనుకునే వారికి ఇది మంచి అవకాశం. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ఈ కోర్సుకు సంబంధించి ఉచిత శిక్షణ అందిస్తోంది.

**యువ ఏఐ ఫర్ ఆల్**

భారత ప్రభుత్వం ప్రారంభించిన యువ ఏఐ ఫర్ ఆల్ ఉచితంగా నేర్చుకునే ఆన్‌లైన్ కోర్సు. దీన్ని పూర్తి చేసినవారు ప్రభుత్వం నుంచి సర్టిఫికెట్ పొందుతారు. ఫ్యూచర్ స్కిల్స్ ప్రైమ్, ఐజీఓటీ కర్మయోగి లాంటి ఆన్‌లైన్ వెబ్‌సైట్లలో, స్వయం పోర్టల్ ద్వారా ఏఐ కోర్సులు ఉచితంగా అందుబాటులో ఉన్నాయి.

**ఎన్నో సంస్థలు**

హార్వర్డ్, ఎమ్ఐటీ, ఐఐటీ మద్రాస్, కాలిఫోర్నియా యూనివర్సిటీలు ఏఐ కోర్సులు ఉచితంగా అందిస్తున్నాయి. ఎలాంటి సాంకేతిక నేపథ్యం అవసరం లేకుండా ప్రారంభ స్థాయి నుంచే పైతాన్, ఏఐ మెషీన్ లెర్నింగ్ నేర్చుకోవచ్చు. సాఫ్ట్‌వేర్ సంస్థల్లో కొలువులు ఆశించేవారికి ఈ కోర్సులు ఉపయోగపడతాయి. విద్యార్థులు ముందుగా ప్రాథమిక కోర్సులతో అధ్యయనం ప్రారంభించాలి. పైతాన్ ప్రోగ్రామింగ్ నేర్చుకోవడం, చిన్న చిన్న ప్రాజెక్టులు చేసి అనుభవాలు పెంచుకోవాలి. ఆన్‌లైన్ కోర్సులతో పాటు పుస్తకాలూ చదువుతుండాలి. ఈరోజు నేర్చుకున్న ఏఐ నైపుణ్యాలు రేపటి కెరియర్‌కు బలమైన పునాదులు అవుతాయి. సరైన మార్గదర్శకత్వం, క్రమశిక్షణ, ఆసక్తులతో చదివితే విద్యార్థులు ప్రపంచ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు. ఇక్కడ కొన్ని ప్లాట్‌ఫామ్‌లు సర్టిఫికెట్ కోసం కొద్ది మొత్తంలో ఫీజు తీసుకోవచ్చు. స్వయం వేదికగా పెద్ద సంఖ్యలో ఏఐ కోర్సులను ఉచితంగా నేర్చుకోవచ్చు. వీటిని ఐఐటీలు, ఐఐఎస్సీ ప్రొఫెసర్లు రూపొందించారు. సీబీఎస్ఈ 11, 12 తరగతుల విద్యార్థుల కోసం ఎన్‌సీఈఆర్‌టీ రూపొందించిన ఏఐ పాఠ్యపుస్తకాల ద్వారా ప్రాథమిక సమాచారం క్షుణ్ణంగా తెలుసుకోవచ్చు. వీటిని ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకునే సౌకర్యం ఉంది.

**ఎలిమెంట్స్ ఆఫ్ ఏఐ**

టెక్నికల్ బ్యాక్‌గ్రౌండ్ లేని విద్యార్థుల కోసం హెల్సింకి యూనివర్సిటీ ఎలిమెంట్స్ ఆఫ్ ఏఐ కోర్సును ఉచితంగా అందిస్తోంది. ఇందులో కోడింగ్ అవసరం లేకుండానే ఏఐ గురించి నేర్చుకోవచ్చు. ఆన్‌లైన్ ద్వారా ఎక్కడి నుంచైనా ఈ కోర్సు పూర్తి చేయవచ్చు. ఏఐ ఎలా పనిచేస్తుంది, దాని వల్ల ఉద్యోగాలు, సమాజం, నైతిక సమస్యలు ఎలా ప్రభావితం అవుతాయి మొదలైన విషయాల గురించీ తెలుసుకోవచ్చు.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ-2026 నేటి నుండి ఆరంభం

## సిబ్బందికి అందరూ సహకరించాలి : ఓటరు నమోదు అధికారి టి.రాజేశ్వరరావు

**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో మండపేట నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం నుండి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, మండపేట ఓటర్ నమోదు అధికారి టి రాజేశ్వరరావు పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐ ఆర్) మూడో దశను మొదలుపెట్టిం దన్నారు. డూప్లికేట్ ఓట్లు, చనిపోయినవారు, అడ్రస్ మారినవారి పేర్లు తొలగించి, కొత్త అర్హులను చేర్చడం చేపడతామని చెప్పారు. జూన్ 14న ఇంటింటికీ బిఎల్ఓల సర్వే నిర్వహిస్తున్నారు.జూన్ 15 -జులై 14 వరకు ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేస్తారన్నారు. జులై 21 క్లెయిమ్‌లు, అభ్యంతరాలు జులై 21 నుండి ఆగస్టు 20 వరకు స్వీకరిస్తారు. తుది



ఓటర్ల జాబితా సెప్టెంబరు 22 న విడుదల చేస్తారన్నారు.నేటి నుండి జులై 14 వరకు బి ఎల్ ఓ లు ఇంటింటికీ వచ్చి వివరాలు పరిశీలన చేస్తారన్నారు. ఆధార్,ఓటర్ ఐడి,అడ్రస్ ప్రూఫ్ తమ వద్ద అందు బాటులో ఉంచుకావాలన్నారు. ముసాయిదా జాబితాలో మీ పేరును చేసుకోవాలన్నారు. పేరు లేకపోతే ఆగస్టు 20 లోపు ఫాం-6 ద్వారా క్లెయిమ్ చేయలన్నారు.అడ్రస్ మార్చుకోవాలంటే ఫాం-8 ఇవ్వాలన్నారు.సెప్టెంబరు 22 న ఫైనల్ లిస్ట్ వస్తుందన్నారు. ఓటర్ల జాబితాలో అర్హుల పేర్లు మాత్రమే ఉండేలా చేయడమే ఎస్ ఐ ఆర్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.జులై 21 వ తేదీన డ్రాఫ్టు రోల్ ప్రచురణ చేస్తారని పేర్కొన్నారు.స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో భాగంగా ఓటు నమోదులో పూర్తి సహాయ సహకారలు అందించాలని కోరారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, నాయకులు, ప్రజా ప్రతినిధులు, బూత్ లెవెల్ అధికారులు అందరూ ఓటర్ల నమోదు ప్రక్రియకు తప్పనిసరిగా తమ పూర్తి సహాయ సహకారములు అందించాలన్నారు.

### జాతీయ రాజకీయాల దిశగా

# జనసేన పార్టీ అడుగులు

## దేశ రాజధాని ఢిల్లీలో పార్టీ శ్రేణులకు ఘన స్వాగతం





**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** జనసేన పార్టీ అధినేత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ జనసేన పార్టీని జాతీయ రాజకీయాల దిశగా మలచడానికి దేశ రాజధాని ఢిల్లీలో మూడు రోజులు పాటు పార్టీ శ్రేణులతో సమీక్ష సమావేశంలో దేశ రాజకీయాలపై దిశ నిర్దేశం చేయనున్నారు. ఆదివారం జనసేన పార్టీ మంత్రులు, ఎమ్మెల్సీలు, శాసనసభ్యులు దేశ రాజధాని ఢిల్లీకి ప్రయాణమయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర టూరిజం శాఖమాత్యులు కందుల దుర్గేష్, రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ తదితరు ఢిల్లీకి చేరుకోగా, వారికి కేంద్ర మంత్రివర్యులు భూపతి రాజు శ్రీనివాస్ వర్మ పుష్ప గుచ్చం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈనెల 14వ తేదీన 16వ తేదీ వరకు మూడు రోజుల పాటు జనసేన శ్రేణులతో ప్రతిష్టాత్మకంగా సమీక్షా సమావేశం నిర్వహించి, జాతీయ రాజకీయాలపై దృష్టి సాధించనున్నట్లు సమాచారం. మరి ముఖ్యంగా "సేన ప్రస్థానం-జాతీయ సమగ్రత కోసం"అన్న నినాదంతో చేపట్టవలసిన కార్యాచరణపై పార్టీ శ్రేణులతో చర్చించనున్నారు.

### ది జాంపేట దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో

# ప్రతిభ పురస్కారాలు ప్రదానోత్సవం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ది.జాంపేట దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఈ ఏడాది పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు వచ్చిన దేవాంగ విద్యార్థినీ విద్యార్థులకు సంఘ సభ్యుల సహాయ సహకారంతో సంఘ సభ్యుల బంధువులు వారికి సంబంధించిన స్నేహితుల పిల్లలకు జాంపేట శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి వారి కళ్యాణ మండపం నెంబర్ 2 లో ది జాంపేట దేవాంగ సంక్షేమ సంఘం తరపున సుమారు 25 మందికి నగదు పురస్కారం జ్ఞాపికలు ఇచ్చి సత్కరించడం జరిగినది.సంఘ అధ్యక్షులు గంపా గిరిజా శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పదవ తరగతి లో అత్యధిక మార్కులు వచ్చిన వాటిలో విద్యార్థిని విద్యార్థుల మార్కుల లిస్ట్ ప్రకారం ప్రథమ స్థానంలో వట్టం జై కృష్ణ కుమార్ 592,ద్వితీయ స్థానంలో ఆశపు హర్షవర్ధన్ 585,తృతీయ స్థానంలో దాసరి జై శ్రీ సాత్విక్ 581, ఆకాశం భవ్య తేజశ్రీ, 581 సమాన మార్కులు సాధించిన వీరి ఇద్దరకు , మొత్తం నలుగురు విద్యార్థులకు డాక్టర్ కాలెపు గణేష్ రామ్ దంపతులు, 5వ స్థానం 6వ స్థానం వచ్చిన వారికి పింజర్ల భాస్కరరావు దంపతులు,7వ స్థానం 8వ స్థానం వచ్చిన వారికి రొబ్బి విజయ శేఖర్ దంపతులు 9వ స్థానం వచ్చిన వారికి అల్లక వీర ప్రతాప్ దంపతులు,మిగిలిన సభ్యులకు సంఘ సహాయ నిధి నుండి గిఫ్ట్ ఓచర్స్ ఇవ్వడం జరిగినది.కార్యదర్శి నల్లా శివ శంకర్రావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్,జాంపేట దేవాంగ సంఘ గౌరవ అధ్యక్షులు రొబ్బి విజయ శేఖర్, శ్రీ ఉమారామలింగేశ్వర స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ దాసరి గురునాధరావు,రాజేంద్రనగర్ దేవాంగ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ బళ్లా శ్రీనివాసరావు, ది జాంపేట కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ పూర్ణిమ ప్రసాద్,రాజేంద్రనగర్ దేవాంగ సంఘం అధ్యక్షులు అల్లంకి మణికంఠ, ది జాంపేట దేవాంగ సంఘ సభ్యులు మొతికి వినయ్ మనోజ్,కొడమటి జగన్మోహన్ రావు,మావూరి బాబూరావు, ముప్పన బుచ్చేశ్వరరావు,జిలగం రాజు,బళ్ళా సత్యనారాయణ, పింజర్ల సూర్య ప్రభాకరరావు, కొడమటి బవర్రాజు,సురత సత్యనారాయణ,గంపా విక్రమ ప్రకాష్,కటకం కేశవ తదితరులు పాల్గొన్నారు.

## హృదయపూర్వక శుభాకాంక్షలు

**భారత మహిళల క్రికెట్ విజయగాథ జూన్ 14 2026**




బ్యాట్ గర్జించగా బౌండరీల వర్షం..!
బంతి విసిరితే వికెట్ల పతనం..!

మొదటి మరియు రెండవ వికెట్ దీప్తి శర్మ తీసి
భారత కీర్తిని ప్రపంచం చాటింది..!
బంతి విసిరి శ్రీ చరణి మరో వికెట్ తీసి
అభిమానుల గుండెల్లో ధైర్యం నింపింది..!

ధైర్యమే ఆయుధం, పట్టుదలే బలం..!
ప్రతి అడుగులో కనిపించిన జ్వలం..!

స్టేడియం నిండా జై భారత్ నినాదం..!
ప్రతి హృదయంలో గర్వానందం..!

మహిళా శక్తికి ఇది గొప్ప నిదర్శనం..!
భారత క్రికెట్‌కు ఇది స్వర్ణ కిరీటం..!

గెలుపు మీది, గర్వం దేశమంతా..!
పాకిస్తాన్ జట్టు పై మీ విజయంతో
వెలిగింది భారతమాత..!

మనోధైర్యంతో వెనుకడుగు వేయకుండా
విజయ పతాకం ఎగురవేసిన మీకు
హృదయపూర్వక శుభాకాంక్షలు.

– మీ అభిమాని
మంజుల పత్తిపాటి

### ఆగిన సత్యసాయి

# మెరుగుపడని సిబ్బంది జీవితాలు



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లాలో శ్రీ సత్య సాయి త్రాగునీటి సిబ్బంది ఏడు నెలల జీతాలు పిఎఫ్ ఈయస్ఐ లేక ఇబ్బంది గురవుతున్న కారణంగా అలాగే ప్రాజెక్టును జిల్లా పరిషత్ ద్వారా నిర్వహణ మెయింటినెన్స్ కలిపి చేయడం వల్ల సమ్మె చేస్తేనే కానీ జీతాలు వచ్చే పరిస్థితి కనబడటం లేదు.పాత కాంట్రాక్టర్ జీతం ఇవ్వకుండా వదిలి వెళ్ళారు. అడిగితే నాకు సంబంధం లేదని చెప్తున్నారు.ఇటీవల వచ్చిన కొత్త కాంట్రాక్టర్ మెయింటెనెన్స్ కి డబ్బులు పెట్టకపోవడం వల్ల ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు పరిస్థితిలో మార్పు రాలేదు. దానివల్ల ప్రజలకు త్రాగునీరు అందించలేకపోతున్నావని బాధ ఒకవైపు కష్టపడి పనిచేస్తున్న జీతాలు ఇవ్వడం లేదని మరొకవైపు రోజురోజుకు పెరుగుతున్న నిత్యవసర వస్తువులు ధరలను తట్టుకోలేక అప్పులు తెచ్చుకునీ ఇప్పటివరకు గడుపుకుంటూ రావడం జరిగింది. ఇక అప్పు పుట్టే పరిస్థితి కూడా లేకపోవడం వలన దిక్కు తోచని పరిస్థితిలో ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి ప్రాజెక్టు ఆపరేషన్ మెయింటినెన్స్ సపరేట్ చేసి జీతాలు నెల నెల వచ్చే విధంగా ఏర్పాటు చేయాలని గత 20 రోజుల ముందే అధికారులకు కాంట్రాక్టర్ కు లెటర్ ఇచ్చిన స్పందన కరువు అవడంతో సమ్మె కి వెళ్లడం జరుగుతుందని, ప్రజలు ఈ సమ్మెకు మద్దతుగా నిలబడాలని ప్రభుత్వం సత్యసాయి బాబా ఆశయాన్ని బతికించాలని వేడుకుంటూ సోమవారం నుంచి ప్రత్యక్ష పోరాటంలోకి వెళ్లడం జరుగుతుందని ప్రజా ప్రతినిధులకు అధికారులకు ప్రజలకు మీడియా ద్వారా సిబ్బంది యూనియన్ ప్రెసిడెంట్ పాటి శేషారావు, కట్టమూరు వీరబాబు, మహంతి వెంకటేష్, యు. గణపతి, లక్ష్మీనారాయణ, రామకృష్ణ తెలియపరచడం జరుగింది.

### రాజ్యసభ సీట్ల వేలంపాటపై

# మేడా శ్రీనివాస్ విమర్శలు

## ఉచిత విద్య, వైద్యం అమలు చేసే ధైర్యం పాలకులకు ఉందా? : ఆర్‌పీసీ మేడా శ్రీనివాస్ ప్రశ్న


**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యసభ స్థానాలను భారీ మొత్తాలకు విక్రయించినట్లుగా కనిపిస్తున్న రాజకీయ పరిణామాలు ప్రజాస్వామ్యానికి హానికరమని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (ఆర్‌పీసీ) వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ విమర్శించారు. పార్టీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన వారాంతపు సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీలకు సంవత్సరాలుగా సేవలందిస్తున్న దిగువస్థాయి నాయకులకు చట్టసభల్లో అవకాశం కల్పించకుండా, ఆర్థికంగా బలమైన వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. రాజకీయ పార్టీల్లో కింది స్థాయి కార్యకర్తలు కేవలం జెండాలు మోయడానికే పరిమితమవుతున్న పరిస్థితులు మారాలని పేర్కొన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా-వైద్య వ్యవస్థలపై ఆధారపడకుండా, ఉన్నత ప్రమాణాలతో ఉచిత విద్య, వైద్యం అందించే విధానాలను అమలు చేసే సంకల్పం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందా అని ప్రశ్నించారు. ప్రజలపై అప్పుల భారం మోపుతూ అభివృద్ధి పేరుతో ప్రచారం చేసుకోవడం సరైన విధానం కాదన్నారు. కొన్ని మీడియా సంస్థలు ప్రజా సమస్యల కంటే రాజకీయ ప్రయోజనాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాయని ఆరోపించారు. మీడియా ప్రజల్లో విమర్శనాత్మక దృక్పథాన్ని పెంపొందించే విధంగా వ్యవహరించాలని సూచించారు. దేవాలయాల ఆస్తుల




పరిరక్షణ, పారదర్శక నిర్వహణపై ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన కోరారు. దేవాదాయ ఆస్తుల వినియోగంలో పూర్తి పారదర్శకత ఉండాలని పేర్కొన్నారు. యువత కుల, మత, రాజకీయ ఉన్మాదాలకు దూరంగా ఉండి విద్య, ఉపాధి, సమాజాభివృద్ధి, దేశాభ్యున్నతి వంటి అంశాలపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. కుల ఆధారిత ఉద్యమాల కంటే భవిష్యత్ తరాలకు మార్గనిర్దేశం చేసే అభివృద్ధి ఉద్యమాలు అవసరమన్నారు. సమావేశానికి ఆర్‌పీసీ సీనియర్ సెక్యులర్ నాయకుడు పెండ్యాల కామ రాజు అధ్యక్షత వహించారు. పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఎమ్మెల్సీ తోటను కలిసిన

# వైసీపీ రాష్ట్ర కార్యదర్శి దంగేటి



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట వైయస్సార్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర సభార్డినేట్ కమిటి చైర్మన్, వైసిపి పిఏసి కమిటీ మెంబర్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును రాష్ట్ర వైయస్ఆర్సీపీ కార్యదర్శిగా నియమితులైన దంగేటి శ్రీరామ కృష్ణ మూర్తి రాంబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. దుస్సాలువా కప్పి పూలమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ సందర్భంగా తోట త్రిమూర్తులు మాట్లాడుతూ బాధ్యతతో పార్టీ విజయానికి కృషిచేయాలని దిశానిర్దేశం చేశారు. అనంతరం కృష్ణమూర్తికి సాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి, అమలాపురం పార్టీ పరిశీలకులు కటకంశెట్టి ఆదిత్య. యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి సలాది సతీష్, పార్టీ జిల్లా కార్యదర్శి గొలకోటి ప్రకాష్, జిల్లా అధికార ప్రతినిధి పెమ్మిరెడ్డి మురళీకృష్ణ, యరమాటి వెంకన్నబాబు, చిక్కం నాగబాబు, గుర్లింక చిన్న తదితరులు పాల్గొన్నారు.

### ఇండియన్ రెడ్ క్రాస్‌కి కృతజ్ఞతలు తెలిపిన

# బ్లడ్ డోనర్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు తొగరు మూర్తి

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** సమాజంలో అందరికీ ఉపయోగపడేలా సహాయ సహకారాలు అందిస్తూ రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ సమాజ హిత కార్యక్రమాలు చేస్తున్న వ్యక్తులకు ఇచ్చే ప్రతిష్టాత్మక అవార్డుకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తనను ఎంపిక చేసినట్లు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్లడ్ డోనర్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు తొగరు మూర్తి తెలిపారు. వరల్డ్ బ్లడ్ డోనర్ డే (అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవం) సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ నిర్వహించిన సమావేశంలో కాకినాడ జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ తనను ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా తొగరుమూర్తి జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ వై.డి. రామారావుకి ప్రత్యేక కృతజ్ఞతలు





తెలియజేశారు. యువతీ యువకులు సమాజ హిత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సామాజిక దృక్పథాన్ని అలవర్చుకోవాలని ఆపదలో ఉన్న తోటి వారిని ఆదుకోవడం అందరి సామాజిక బాధ్యత అని ఆయన పిలుపునిచ్చారు. ఇప్పటివరకు తనకు 97 సార్లు రక్తదానం చేసే భాగ్యాన్ని కల్పించిన భగవంతుడికి నిరంతరం ప్రోత్సహిస్తున్న కుటుంబ సభ్యులకు, మిత్రులకు మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి ఈ సందర్భంగా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. 'రక్తదానం - జీవనదానం' అనే ఉదాత్తమైన భావనతో మరింత మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రాణదాతలుగా మారాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమాజంలో రక్తం దొరకక ఎవరూ ప్రాణాలు కోల్పోకూడదు అనే పవిత్ర ఆశయంతోనే 'బ్లడ్ డోనర్స్ క్లబ్' అనే సంస్థను స్థాపించి, ఇప్పటివరకు వేలాది మందికి ప్రాణదానం చేశామని గుర్తుచేశారు. రక్తదాతలు అందరికీ అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేస్తూ భవిష్యత్తులో రక్తదానం చేసి ప్రాణదానం చేయడానికి సిద్ధంగా ఉన్నవారు ఎవరైనా తన మొబైల్ నెంబర్ 98482 46878 కి మెసేజ్ చేసి సంప్రదించాల్సిందిగా కోరారు.

ఈ సత్కార సమావేశంలో రెడ్ క్రాస్ చైర్మన్ వై.డి. రామారావు, శివకుమార్, అప్పలరాజు, నాగు, ముసమళ్ళ బాబ్జి, పెద్దిరెడ్డి సతీష్, బ్యాంక్ ప్రసాద్, భాను, ఉలిశెట్టి బాబి తదితరులు పాల్గొని ముక్తకంఠంతో అభినందనలు తెలిపారు.

### రామచంద్రపురం - యానాం మార్గంలో

# పునఃప్రారంభమైన వాహనాల రాకపోకలు

### ప్రయాణికులకు తీరిన ఇబ్బందులు

**వేగాయమ్మపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నుండి వేగయ్యమ్మపేట మీదుగా యానం వెళ్లే ప్రధాన రహదారిలో వాహనాల రాకపోకలు ఈరోజు నుండి పునఃప్రారంభమయ్యాయి. గత కొన్ని రోజులుగా వేగయ్యమ్మపేట పరిధిలో రహదారి నిర్మాణ పనులు (రోడ్డు పనులు) అత్యంత వేగంగా జరుగుతున్న కారణంగా భద్రతా కారణాల దృష్ట్యా అధికారులు ఈ మార్గంలో వెళ్లే ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలతో పాటు ఇతర ప్రైవేటు వాహనాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేసిన సంగతి తెలిసిందే. దీనివల్ల ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలను



ఆశ్రయించాల్సి రావడం సమయం వృథా అవ్వడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే సంబంధిత కాంట్రాక్టర్, అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో ఈరోజు ఉదయం నుండి రవాణా సౌకర్యం మళ్లీ యధావిధిగా అందుబాటులోకి వచ్చింది. బస్సులు, ఇతర వాహనాలు ఎప్పటిలాగే నడుస్తుండటంతో నిత్య ప్రయాణికులు, ఉద్యోగులు, వ్యాపారస్థులు మరియు స్థానిక ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. రవాణా వ్యవస్థ మళ్లీ సాధారణ స్థితికి చేరుకోవడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

# మైనార్టీ విద్యార్థులకు రూ.6 కోట్లతో అత్యుత్తమ రెసిడెన్షియల్ విద్య

**250 మంది విద్యార్థులకు ప్రముఖ విద్యా సంస్థల్లో ప్రవేశాలు - బాలికల ఎంపిక 41 శాతానికి చేరడం శుభపరిణామం**

**మైనారిటీ విద్యార్థుల భవిష్యత్తుకు వక్ఫ్ బోర్డు భరోసా - మైనారిటీ సంక్షేమ, న్యాయ, వక్ఫ్,ఉర్దూ అకాడమి శాఖల మంత్రి ఎన్.ఎమ్.డి. ఫరూఖ్**

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర మైనార్టీ సంక్షేమం, వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రం లో తాలిమ్- ఏ - హునర్ టాలెంట్ టెస్ట్ లో ఉత్తీర్ణులైన 250 మంది విద్యార్థులకు కాలేజ్ అలాట్మెంట్ సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమానికి మైనారిటీ సంక్షేమ, న్యాయ, వక్ఫ్ మరియు ఉర్దూ అకాడమీ శాఖల మంత్రి ఎన్.ఎమ్.డి. ఫరూఖ్ హాజరై మాట్లాడుతూ.. . గతంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిపాలనా కాలంలో ముస్లిం విద్యార్థులు బాగా చదువుకుని మంచి స్థాయికి చేరుకున్నారన్నారు. రాష్ట్ర రాష్ట్ర మైనారిటీ విద్యార్థుల అభ్యున్నతి, విద్యా వికాసమే ధ్యేయంగా వక్ఫ్ బోర్డు తీసుకున్న నిర్ణయాలు అభినందనీయమని, ఇవి మైనారిటీల చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతాయన్నారు. పేదరికంలో ఉన్న మైనార్టీ ఆడపిల్లలు, విద్యార్థులు ఉన్నత చదువుల నుంచి స్కూల్ డ్రాపౌట్ కాకుండా ఉండేందుకు వక్ఫ్ బోర్డు తన సొంత వనరుల ద్వారా దాదాపు రూ. 5 కోట్ల ఖర్చుతో విద్యార్థులను చదివించేందుకు ముందుకు రావడం గొప్ప విషయమన్నారు. పదవ తరగతిలో 450 మార్కులకు తగ్గకుండా అర్హత సాధించిన విద్యార్థులకు ప్రత్యేక పరీక్ష ద్వారా ఎంపిక చేసి ఉచిత రెసిడెన్షియల్ విద్య కార్యక్రమాన్ని అందిస్తున్నారన్నారు. గతంలో కర్నూలు, గుంటూరు, నిజామాబాద్‌లలో ప్రారంభమైన రెసిడెన్షియల్ (గురుకుల) పాఠశాలల స్ఫూర్తితో మరిన్ని విద్యా సంస్థలను బలోపేతం చేయనున్నామన్నారు. రాష్ట్రంలో వక్ఫ్ బోర్డుకు ఉన్న దాదాపు 11,000 ఎకరాల భూములను కాపాడుకుంటూ, విజయవాడ, గుంటూరు, నెల్లూరు వంటి నగరాల్లో ఉన్న విలువైన వక్ఫ్ ఆస్తులను వాణిజ్యపరంగా అభివృద్ధి చేసి బోర్డు ఆదాయాన్ని పెంచాలని పిలుపునిచ్చారు. ఆక్రమణలకు గురైన మిగిలిన భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు చట్టపరమైన చర్యలు వేగవంతం చేయనున్నామన్నారు. గతంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హయాంలో ప్రవేశపెట్టిన ఉచిత కంప్యూటర్ శిక్షణా



కార్యక్రమాల తరహాలోనే, ప్రస్తుత ఐటీ యుగానికి అనుగుణంగా మైనారిటీ యువతకు స్కిల్ డెవలప్‌మెంట్, ఐటీ శిక్షణ అందించేందుకు ప్రాధాన్యత ఇవ్వనున్నామన్నారు. మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో విద్యా రంగానికి లభిస్తున్న మద్దతుతో డీఎస్సీ ద్వారా ఇప్పటికే ఎంతోమంది మైనారిటీ అభ్యర్థులు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారని గుర్తుచేశారు. వక్ఫ్ బోర్డు తీసుకున్న ఈ అద్భుతమైన నిర్ణయాలకు ప్రభుత్వం తరఫున, కలెక్టర్ల ద్వారా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ.. తాలీమ్-ఎ-హునర్ (ఝుశ్రీఅఎ-వ-ఎబఝుతీ) టెస్ట్ లో 250 మంది మెరిట్ విద్యార్థులను ఎంపిక చేసి, వారి చదువు కోసం దాదాపు ఆరు కోట్ల రూపాయలు ఖర్చు చేయబోతున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఎంపిక ప్రక్రియలో మొత్తం 7,400 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 6,605 మంది పిల్లల నుంచి ఈ విద్యార్థులను ఉచిత రెసిడెన్షియల్ విద్య కార్యక్రామానికి ఎంపిక చేశామన్నారు. ముస్లిం విద్యార్థులకు ఇళ్ల వద్ద సరైన వాతావరణం ఉండకపోవచ్చని, పోటీని తట్టుకునేలా తీర్చిదిద్దడానికి రెసిడెన్షియల్ విద్య ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. కన్జర్వేటివ్ ఆలోచనల వల్ల ఆడపిల్లలను హాస్టల్స్‌కు పంపడానికి వెనుకాడుతుంటారని, వారిని ప్రోత్సహించడానికి 33 శాతం రిజర్వేషన్ కేటాయించగా, ఊహించని విధంగా 41శాతం మంది ఆడపిల్లలు దీనికి ఎంపికయ్యారని ఆనందం వ్యక్తం చేశారు. ఎంపికైన విద్యార్థులను విజయవాడలోని ప్రతిష్టాత్మకమైన చైతన్య గోశాల క్యాంపస్‌లో చేర్పించి, ఉన్నత విద్యను అందించబోతున్నట్లు చైర్మన్ ప్రకటించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా, పేదరికం చదువుకు అడ్డుకాకూడదనే ఉద్దేశంతో P4 కార్యక్రమంలో భాగంగా ఈ విద్యా కార్యక్రమాలను ముందుకు తీసుకెళు_్తన్నట్లు ఎపి వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలియజేశారు. స్థానిక పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ... ముస్లిం సోదరులతో మా కుటుంబానికి దశాబ్దాలుగా ఉన్న వ్యాపార, సాంస్కృతిక సంబంధాలను గుర్తుచేసుకున్నారు. 'తల్లికి వందనం' ద్వారా ముస్లిం విద్యార్థులకు కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఒక్కొక్కరికీ ?15,000 చొప్పున అందుతుందని, దీనివల్ల వెనుకబడిన ముస్లిం కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని హర్షం వ్యక్తం చేశారు. సుమారు 7,400 దరఖాస్తుల నుంచి ఎంపికైన విద్యార్థులను వక్ఫ్ బోర్డ్ ఖర్చులతో రాష్ట్రంలోని ఉత్తమ కార్పొరేట్ కాలేజీలలో (××, మెడికల్ కోచింగ్) చేర్పించడాన్ని అభినందించారు. 'స్వర్ణాంధ్ర 2047' సాధనలో నేటి యువతదే కీలక పాత్రని, ~××, క్వాంటం కంప్యూటింగ్ వంటి ఆధునిక కోర్సులు చదివి ఇక్కడే ఉద్యోగాలు పొందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. యువత ఉపాధి కోసం షాదీఖానాలలో 'స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు' ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలని ఆకాంక్షిస్తున్నారన్నారు. శాసన మండలి సభ్యులు జకియా ఖానమ్ మాట్లాడుతూ... గత ప్రభుత్వాలు ఎవ్వరూ చేయని విధంగా పేద ముస్లిం విద్యార్థుల కార్పొరేట్ చదువుల కోసం వక్ఫ్ బోర్డు చైర్మన్ తీసుకున్న ఈ వినూత్న నిర్ణయం అభినందనీయమని కొనియాడారు. ఎంపికైన 250 మంది విద్యార్థులు బాగా చదువుకుని, సమాజంలో ఉన్నత ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని, కమ్యూనిటీకి స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. మైనార్టీ వ్యవహారాల సలహాదారు షరీఫ్ మహ్మద్ మాట్లాడుతూ ముస్లిం విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న వక్ఫ్ బోర్డు కల్పిస్తున్న ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యలో రాణించాలని సూచించారు. క్రమశిక్షణ, కష్టపడి చదవడం ద్వారా జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. విద్యతోనే కుటుంబాల అభివృద్ధి సాధ్యమవుతుందని, ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి బాధ్యతగా స్వీకరించాలని అన్నారు. శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ఏ కుటుంబంలో విద్యాధికులు ఉంటారో ఆ కుటుంబం అన్ని విధాలుగా ముందుకు వెళ్తుందని, నూరు శాతం అక్షరాస్యత సాధించడంలో తల్లిదండ్రుల చిత్తశుద్ధి ముఖ్యమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 1995 లో వేసిన విద్యా పునాదుల వల్లే నేడు రాష్ట్రంలో విద్యాధికులు పెరుగుతున్నారని, పిల్లలను బడికి పంపడంపై ఆయనకున్న గట్టి సంకల్పాన్ని గుర్తుచేశారు. శాసనసభ్యులు మహ్మద్ నజీర్ అహ్మద్ మాట్లాడుతూ ముస్లిం సమాజం సామాజికంగా, ఆర్థికంగా ఎదగడానికి విద్యే ఏకైక మార్గమని, ఖురాన్ ఆదేశాల ప్రకారం విద్య అనేది నమాజ్ లాంటి ఒక తప్పనిసరి అవసరమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెచ్చిన 'ఉమ్మీద్ పోర్టల్' మరియు బడ్జెట్ ద్వారా రాష్ట్రంలో 65 వేల ఎకరాల వక్ఫ్ ఆస్తులను కాపాడటం జరిగిందని చెప్పారు. ఈ మంచి విద్యా కార్యక్రమానికి తన వంతుగా లక్ష రూపాయల విరాళం ప్రకటిస్తూ, భవిష్యత్తులో మరింత సహాయం చేస్తానని హామీ చేశారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ మహమ్మద్ ఫరూఖ్ షుబ్లీ మాట్లాడుతూ దేశ చరిత్రలోనే మొదటిసారిగా వక్ఫ్ బోర్డు ఆదాయాన్ని మైనారిటీ విద్యార్థుల ప్రయోజనాల కోసం కేటాయించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు సభ ద్వారా ధన్యవాదాలు తెలియజేస్తున్నారన్నారు. ప్రభుత్వ సహాయాన్ని గుర్తించి, విద్యార్థుల సంఖ్యను భవిష్యత్తులో 2,500 కి పెంచుకునేలా కమ్యూనిటీ నుండి మంచి స్పందన రావాలని కోరారు. విజయవాడ డీసీపీ షరీనా బేగం మాట్లాడుతూ ముస్లిం మైనారిటీలలో అక్షరాస్యత చాలా తక్కువగా ఉందని, ఖురాన్ అంటేనే "చదవడం" అని అర్థం ఉన్నప్పుడు మనం చదువులో వెనుకబడటం ఆలోచించాల్సిన విషయమని ఆమె అన్నారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎ. తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ఏపీ వక్ఫ్ బోర్డ్' తాలిం - ఏ - హునర్ ప్రోగ్రాం కింద ఎంపికైన 250 మంది విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కమిషనర్ అభినందించారు. ఈ అడ్మిషన్ లెటర్ విద్యార్థుల జీవితాలను మార్చే ఒక 'పాస్‌పోర్ట్' లాంటిదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లుగా విద్యా రంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకు వచ్చిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ మహమ్మద్ ఫరూఖ్ షుబ్లీ, ఏపీనూర్ భాషా/దూదేకుల సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా, ఏపీ స్టేట్ షేక్ వెల్ఫేర్ మరియు డవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వీఎస్ ముఖ్తియార్, వక్ఫ్ బోర్డు సీఈవో యాకుబ్ బాషా, మాజీ ఎమ్మెల్సీ షేక్ మహ్మద్ ఇక్బాల్, ముత్తావలీలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

### స్వచ్ఛంద రక్తదానంలో పాల్గొన్న

# తూర్పుగోదావరి జిల్లా పోలీసులు

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్, ఐపీఎస్ ఆదేశాల మేరకు ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన కార్యక్రమంలో





పాల్గొని మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేసి సామాజిక బాధ్యతను నిర్వర్తించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి సకాలంలో రక్తం అందించడం ద్వారా ప్రాణరక్షణ కల్పించవచ్చనే సందేశాన్ని ప్రజలకు అందించారు. అధికారులు మాట్లాడుతూ, రక్తానికి ప్రత్యామ్నాయం లేదని, రక్తదానం మానవతా సేవల్లో అత్యున్నతమైనదని, అది అవసరంలో ఉన్న వారికి ప్రాణదానంగా నిలుస్తుందని తెలిపారు. ప్రతి ఆరోగ్యవంతమైన వ్యక్తి క్రమం తప్పకుండా రక్తదానం చేసి సమాజ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# "సండేస్ ఆన్ సైకిల్"





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎల్. చెంచి రెడ్డి ఆధ్వర్యంలో ఈరోజు "సండేస్ ఆన్ సైకిల్" కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి నిర్వహించిన సైకిల్ ర్యాలీలో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని, సైక్లింగ్ ద్వారా ఆరోగ్య పరిరక్షణతో పాటు పర్యావరణ సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సైక్లింగ్ వల్ల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు కాలుష్యం, ఇంధన వినియోగం తగ్గుతాయని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ సైక్లింగ్‌ను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. ఫిట్‌నెస్ పట్ల ఆసక్తి పెంపొందించడం, పర్యావరణ పరిరక్షణపై చైతన్యం కల్పించడమే ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ (ఏఆర్) పి.సంజీవ్ కుమార్ గారు, ఇతర పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వం వాయిస్ తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

కాకినాడ జిల్లా ఎడిషన్

సోమవారం, 15 జూన్ 2026
www.viswamvoice.com





# రెండేళ్లలో కూటమి పాలనలో ఎనలేని అభివృద్ధి

## రాష్ట్రాన్ని రాజధాని లేకుండా ముక్కలు చేసిన జగన్ : టీడీపీ మహిళా నేతలు వెల్లడి



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** గడచిన రెండేళ్లలో కూటమి ప్రభుత్వ పాలనలో ఎనలేని అభివృద్ధి రాష్ట్రంలో జరిగిందని టీడీపీ మహిళా నేతలు పేర్కొన్నారు. గత మాజీ సీఎం జగన్ అరాచక పాలన వల్ల రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని విమర్శించారు. టీడీపీ మహిళా నేతలు తుమ్మల సునీత, కొప్పనాతి నాగకుమారి, పిర్ల లక్ష్మీ ప్రసన్నలు ఆదివారం కాకినాడలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ వారు టీడీపీ కూటమి పాలనపై దుష్ప్రచారం చేస్తూ ర్యాలీలు చేయడం అర్ధరహితమన్నారు. రెండు నెలల్లో జరిగిన అభివృద్ధి వారు విమర్శించడం తగదన్నారు గడిచిన రెండేళ్ల కాలంలో రోడ్లు, పింఛనులు, తల్లికి వందనం, మత్స్యకార భరోసా వంటి పథకాలు అందించి వారి అభిమానానికి గురయ్యామని చెప్పారు. టీడీపీని విమర్శించిన వైసీపీ మహిళా నేత సుంకర శివప్రసన్న టీడీపీ నుంచి కార్పొరేటర్గా గెలిచిన సంగతి మర్చిపోయారన్నారు. టిడిపి నుంచి వైసీపీలోకి ప్లేటు ఫిరాయించిన ఆమె విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయినట్లు వారు పేర్కొన్నారు. డీఎస్సీ, పోలీస్ ఉద్యోగంలు ఇవ్వడమే కాకుండా పరిశ్రమలు, పెట్టుబడులు సీఎం చంద్రబాబు రాష్ట్రంలో తీసుకొచ్చారని వారు పేర్కొన్నారు. విజన్ ఉన్న చంద్రబాబు ముందు జగన్ ఎప్పటికీ సరిపోరని వారు ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో వడిసెల దాలమ్మ, నమ్మి సత్యవాణి, తిరుదు ఎల్లమ్మ , బంగారు సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చిన ఘనత శ్రీనివాస్‌దే : స్వరూప్

## ఏ పాఠశాలలో పనిచేసిన ప్రత్యేక గుర్తింపు - ముత్యం దంపతులకు ఘన సత్కారం




**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం రఘుదేవపురం పాఠశాలకు మౌలిక వసతులు కల్పన, ఉత్తీర్ణత శాతం పెంచడానికి ముత్యం శ్రీనివాస్ చేసిన కృషి ఎనలేనిదని, తద్వారానే ఆ పాఠశాలకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు లభించిందని ఆ ఘనత ముత్యం శ్రీనివాస్ కే దక్కుతుందని కొవ్వూరు డివిజన్ డిప్యూటీ విద్యాశాఖ అధికారి స్వరూప్ కొనియాడారు. ఆదివారం జంబుపట్నం రాజా కన్వర్షన్ హాల్లో కోటి జిల్లా ప్రజా పరిషత్ ప్రధానోపాధ్యాయుడు ముత్యం శ్రీనివాస్ పదవీ విరమణ ఆత్మీయ కలయిక ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పిఆర్టియు, యుటిఎఫ్ జిల్లా నాయకులు, ఉభయ గోదావరి జిల్లాల ప్రధానోపాధ్యాయులు, పలువురు ప్రజా ప్రతినిధులు ముత్యం శ్రీనివాస్ పదవి విరమణ ఆత్మీయ కలయికకు పెద్ద ఎత్తున విచ్చేసి, గజమాలతో ఘనంగా సత్కరిస్తూ, ప్రశంస పత్రాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కొవ్వూరు డివిజన్ డిప్యూటీ విద్యాశాఖ అధికారి స్వరూప్, కోరుకొండ ఎంఈఓ కుశలోవ దొర, జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘ అధ్యక్షులు రమణరావు తదితరులు మాట్లాడుతూ శ్రీనివాస్ విద్యాశాఖలో ఎటువంటి రిమార్కులు లేకుండా 42 రెండేళ్లపాటు సుదీర్ఘ సేవలందించడంతో పాటు ఆయా పాఠశాలలలో మౌలిక వసతులు, ఉత్తీర్ణత శాతం పెంపుకు కృషి, పేద విద్యార్థులకు ఆర్థిక చేయూత, అందరితో చక్కగా మమేకమవుతూ పలువు ఉపాధ్యాయులకు ఆదర్శప్రాయంగా నిలిచారని కొనియాడారు. సీతానగరం మండలం రఘుదేవపురంలో పాఠశాల మౌలిక వసతులు కల్పన వంటి అంశాలతో ఆ పాఠశాలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తేవడానికి ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఆయన శేష జీవితం సంతోషంగా గడవాలన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తన పదవీ విరమణ ఆత్మీయ కలయికకు ఎంతో ఆప్యాయతగా విచ్చేసి, తనను అభినందించి నందుకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. కోటి గ్రామ విద్యార్థిని విద్యార్థులు పెద్ద ఎత్తున విచ్చేసి గజమాలతో శ్రీనివాస్ సావిత్రి దంపతులను ఘనంగా సత్కరిస్తూ, కొద్దిసేపు భావోద్వేదానికి గురై ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ హక్కునకు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు జిల్లా అధ్యక్షులు పల్లా రాజారావు, కోలా సత్యనారాయణ, శివ బాబు, కొచ్చర్ల రమేష్, సింగారపు వెంకటేశ్వరరావు, ఎంఈఓ సుబ్రమణ్యం, సతీష్ పద్మ కుమారి, వెంకటేశ్వరరావు సత్య కుమారి, సత్యనారాయణ భారతి, హరిహర కుమార్ యమున, సాదే రాజు, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ ఎంపీ సీటు మూడు ముక్కలు... కూటమి ఆశలకు రెక్కలు!

కేంద్ర ప్రభుత్వానికి ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి తాజాగా చేసిన సూచనల మేరకు పెద్ద లోక్ సభ నియోజకవర్గాలను రెండూ లేదా మూడు ముక్కలు చేయనున్నారు. దాంతో విశాఖ వంటి పెద్ద పార్లమెంట్ సీట్లు ఇక మీదట మూడుగా మారనున్నాయని అంటున్నారు. ప్రస్తుతం చూస్తే 22 లక్షల ఓటర్లు 27 లక్షల మంది జనాభా విశాఖ ఎంపీ సీటు పరిధిలో ఉన్నారు. కొత్త జనాభా లెక్కలతో మరింత స్పష్టత వస్తుంది. ఆ మీదట 2029 నాటికి జనాభా ఇంకా పెరుగుతుంది అని అంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి సిఫార్సుల మేరకు విశాఖ లాంటి పెద్ద సీట్లు మూడు ముక్కలు అవడం ఖాయంగా కనిపిస్తోంది.

**సహేతుకమైన విభజన :** విశాఖ ఎంపీ సీటు 1952 తొలి సార్వత్రిక ఎన్నికల నుంచి కూడా కొనసాగుతూ వస్తోంది. మొదట్లో నాలుగైదు లక్షలతో ఉండే ఈ నియోజకవర్గం 2024 లోక్ సభ ఎన్నికల నాటికి ఏకంగా 22 లక్షలకు పైగా ఓటర్లతో పెద్ద సీటుగా మారింది. ఒక ఎంపీ ఇన్ని లక్షల మంది ప్రజలకు ప్రతినిధిగా వ్యవహరించడం అంటే చాలా క్లిష్టమైన సమస్యగానే చూడాల్సి ఉంటుంది. ఎనిమిది లేదా తొమ్మిది లక్షల మంది ఓటర్లకు ఒక ఎంపీ అన్నది సూత్రప్రాయమైన విభజనగా ఉంటుందని అది సహేతుకమని అంటున్నారు. ఈ లెక్కన రానున్న రోజులలో




మరింతగా పెరగనున్న విశాఖ సీటుని మూడుగా చేస్తేనే బెటర్ అని అంటున్నారు. ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ప్రతిపాదనలలో కూడా విశాఖను మూడు చేయాలని ఉంది అని అంటున్నారు.

**అదే జరిగితే కనుక :** విశాఖ ఎంపీ సీటు మీద చాలా మందికి కన్ను ఉంటుంది. అదే విధంగా అన్ని పార్టీలూ ఇక్కడ నుంచి పోటీ చేసి గెలవాలని చూస్తాయి. ఇక ఏపీలో టీడీపీ కూటమి విషయం తీసుకుంటే మూడు పార్టీలు ఉన్నాయి. 2024 ఎన్నికల్లో బీజేపీ ఇక్కడ నుంచి పోటీ చేయాలని అనుకుంది. టీడీపీతో పొత్తు ఉన్నప్పుడల్లా బీజేపీ ఈ సీటుని తీసుకునేది. కానీ 2024 ఎన్నికల్లో బాలయ్య చిన్నల్లుడు శ్రీభరత్ పోటీ చేయాలనుకోవడంతో బీజేపీకి అనకాపల్లిని కేటాయించారు. అయితే కొత్త ఫార్ములాతో డీలిమిటేషన్ జరిగితే కనుక 2029 ఎన్నికల్లో ఈ సీటు మూడుగా మారుతుంది అని అంటున్నారు. దాంతో కూటమిలోని మూడు పార్టీలకూ ఎంతో అనుకూలంగా ఉంటుందని చెబుతున్నారు. ఎందుకంటే జనసేన కూడా విశాఖ నుంచి పార్లమెంట్ కి పోటీ చేయాలని 2024 ఎన్నికల సమయంలో ఆశలు పెట్టుకుంది అని గుర్తు చేస్తున్నారు.

**ఈ విధంగా ఉండొచ్చు :** ఇక విశాఖ ఎంపీ సీటు విభజన అంటూ జరిగితే ఎలా ఉంటుంది అన్న చర్చ కూడా సాగుతోంది. తూర్పు, భీమునిపట్నంలతో ఒక ఎంపీ సీటు, అలాగే విశాఖ దక్షిణం, నార్త్ అసెంబ్లీ విశాఖ పశ్చిమం ఒక సీటుగా, గాజువాక , పెందుర్తిలోని కొంత భాగం, ఎస్ కోటల అసెంబ్లీ సీటు కలుపుకుని మూడవ సీటు రావచ్చు అని లెక్క వేస్తున్నారు. అపుడు విశాఖ సెంట్రల్ పార్లమెంట్, భీమునిపట్నం ఎంపీ సీటు, అలాగే ఎస్ కోట ఎంపీ సీటుగా పేర్లు పెట్టే చాన్స్ ఉండొచ్చు అని కూడా అంటున్నారు. అయితే ఇందులో మహిళా రిజర్వేషన్ కూడా ఉంటుంది. అలాగే జనాభా ప్రాతిపదికన కులాలు ఎన్ని ఉన్నాయన్నది కూడా చూస్తారని చెబుతున్నారు. మొత్తం మీద చూస్తే విశాఖ ఎంపీ సీటు మూడు ముక్కలు అయితే మాత్రం ఆశావహులకు జాక్ పాట్ తగిలినట్లే అని అంటున్నారు.

# జిల్లాలో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్



**కాకినాడ క్రైమ్, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లా పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా మరియు సమాజంలో ప్రశాంత వాతావరణాన్ని పెంపొందించే లక్ష్యంతో కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు స్థానిక రౌడీ షీటర్లకు ప్రత్యేక కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్ల ప్రవర్తన, ప్రస్తుత జీవన విధానం మరియు వారి కదలికలను క్షుణ్ణంగా సమీక్షించిన అధికారులు, ఎవరైనా తిరిగి చట్టవ్యతిరేక లేదా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించినా వారిపై కఠిన చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# ఆపరేషన్ వజ్రపహార్లో 30 మోటార్ సైకిళ్లు సీజ్



**కాకినాడక్రైమ్, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశాల మేరకు శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో భాగంగా ఆదివారం అసాంఘిక కార్యకలాపాల గుర్తింపు, అక్రమ వలసదారులు మరియు అనుమానాస్పద కదిలికలను గుర్తించుటకు, నేర నియంత్రణలో భాగంగా గంజాయి, నాటు సారాయి మొదలగు అక్రమ నిల్వల గుర్తింపులో భాగంగా కాకినాడ జిల్లా పోలీసులు భారీ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఇందులో భాగంగా పెద్దాపురం కోట ఏరియాలో ఇన్స్పెక్టర్ వై.ఆర్.కె. శ్రీనివాస్, ఎస్.ఐ. వి. మౌనిక మరియు పోలీసుసిబ్బంది, అలాగే కాకినాడ 2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రేచర్లపేటలో టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఎం. అప్పలనాయుడు, త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ కె.వి.ఎస్. సత్యనారాయణ, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఎం.వి. నాగ దుర్గారావు మరియు పోలీస్ సిబ్బంది కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ లో పాల్గొని విస్తృత తనిఖీలు చేపట్టడంతో పాటు, స్థానిక ప్రజలకు సైబర్ నేరాలు, మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ మరియు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ ఆపరేషన్లో పెద్దాపురం పోలీసులు సరైన పత్రాలు లేని 06 మోటార్ సైకిళ్ళు, కాకినాడ టూ టౌన్ పోలీసులు 24 మోటార్ సైకిళ్లను పోలీస్ స్టేషన్ కు తరలించారు.అత్యవసర సహాయం కోసం 112 టోల్ ఫ్రీ నెంబర్ ని సంప్రదించాలని, గంజాయి మొదలగు మత్తు పదార్థాల సమాచారం ఇచ్చుటకు 1972 నెంబర్ కు కాల్ చేయాలని ఏదైనా సైబర్ నేరం జరిగినట్లయితే 1930కు కాల్ చేయాలని ఈ సందర్భంగా ప్రజలకు పోలీసు అధికారులు సూచించారు.

### పదోన్నతిని బాధ్యతగా భావించి

# విధులు నిర్వహించాలి

## రెవెన్యూ సంఘం జిల్లా అధ్యక్షుడు పితాని



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** బాధ్యతలు నిర్వహిస్తున్న ఉద్యోగికి పదోన్నతి వస్తే అది బాధ్యతగా భావించి తమ విధులకు పూర్తి న్యాయం చేయాలని జిల్లా రెవిన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు పితాని త్రినాధరావు పేర్కొన్నారు. ఆదివారం కాకినాడ రెవెన్యూ అసోసియేషన్ మందిరంలో తాళ్లరేవు మండలం డిప్యూటీ తహశీల్దార్గా పనిచేస్తూ శంఖవరం మండలానికి తహశీల్దార్ పదోన్నతి పొందిన మొసలి సూరిబాబు కు పదోన్నతి శుభాకాంక్షల వేడుకల కార్యక్రమమును నిర్వహించారు. ఈ పదోన్నతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు, ఏపీఆర్ఎస్ఎ జేఏసీ నాయకుడు పితాని త్రినాధరావు మాట్లాడుతూ సూరిబాబు ఉద్యోగం చేరిన నాటి నుంచి గమనిస్తున్నానని తన సంఘంలో ఓసారి కోశాధికారిగా అత్యధిక మెజారిటీతో గెలిచాడన్నారు. అత్యధికంగా ఆ మండలానికి వీఐపీల తాకిడి ఉంటుందని అక్కడ బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన సూరిబాబు మాట్లాడుతూ ఎటువంటి ఇబ్బందులు లేకుండా అక్కడ విధులు నిర్వహించి మండల ప్రజల మన్ననలను పొందుతానని చెప్పారు. అనంతరం సూరిబాబు దంపతులను తాళ్ళరేవు మండలంకు చెందిన రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు, విఆర్ఏలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్ రామ్మోహన్రావు, జిల్లా ఉపాధ్యక్షులు కే చంద్రశేఖర్ రెడ్డి, ట్రెజరర్ కె వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు మద్దతు..

## సీఎం చంద్రబాబుకు రిటైర్డ్ ఇంజనీర్ల లేఖ



**విశ్వం వాయిస్ న్యూస్ :** గోదావరి నది వరద జలాలపై దిగువ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌కు పూర్తి హక్కులు ఉన్నాయని, ఆ నీటిని వినియోగించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు సమర్థనీయమని ఏపీ జలవనరుల శాఖ విశ్రాంత ఇంజనీర్ల సంఘం స్పష్టం చేసింది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు ఎం.విశ్వేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నరసింహమూర్తి నిన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారు. గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ 1978లో వెలువరించిన తీర్పును వారు తమ లేఖలో ప్రస్తావించారు. ఎగువ రాష్ట్రాలకు ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు పోగా, దిగువకు ప్రవహించే మిగులు వరద జలాలను వాడుకునేందుకు ఆంధ్రప్రదేశ్‌కు సంపూర్ణ స్వేచ్ఛ ఉందని వారు తెలిపారు. అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల చట్టం-1956 ప్రకారం, ఈ మిగులు జలాల వినియోగంపై కేంద్ర ప్రభుత్వం గానీ, ఎగువ రాష్ట్రాలు గానీ అభ్యంతరం తెలిపే అధికారం లేదని వారు తేల్చిచెప్పారు. గోదావరి-బనకచర్ల అనుసంధాన పథకం ద్వారా వరద నీటిని బొల్లపల్లి రిజర్వాయర్‌లో నిల్వ చేసి, కరవు పీడిత ప్రాంతాలైన కర్నూలు, కడప, ప్రకాశం జిల్లాలకు 75 శాతానికి పైగా సాగునీటి భరోసా కల్పించవచ్చని సంఘం వివరించింది. ఈ ప్రాజెక్టు రాయలసీమ, కోస్తా ప్రాంతాల్లో వ్యవసాయం, తాగునీటి అవసరాలను తీర్చి, రాష్ట్ర ఆర్థిక స్థిరత్వానికి ఎంతో దోహదపడుతుందని పేర్కొంది. గోదావరి జలాల పంపకాలపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య చర్చలు, న్యాయపరమైన అంశాలు నడుస్తున్న తరుణంలో విశ్రాంత ఇంజనీర్ల సంఘం చేసిన ఈ ప్రకటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

# సమగ్ర ఓటర్ల జాబితా సవరణకు సహకరించండి : కమిషనర్

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్-2026) కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, నగర పాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా కోరారు. జూన్ 15 నుంచి జూలై 14 వరకు నిర్వహించనున్న ఇంటింటి సర్వే కార్యక్రమంలో ప్రజలు చురుకుగా పాల్గొని ఖచ్చితమైన, పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు తోడ్పడాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదయ్యేలా చూడటం, అనర్హులు, మృతులు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. ఓటర్ల వివరాల్లోని తప్పులను సరిదిద్దడంతో పాటు చేర్పులు, మార్పులు, తొలగింపులను నిబంధనల మేరకు చేపడతామని



తెలిపారు. సర్వేలో భాగంగా బూత్ లెవల్ అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫామ్-2 అందజేస్తారని, ఓటర్లు తమ పూర్తి వివరాలను నమోదు చేసి సంబంధిత బీఎల్‌వోలకు అందజేయాలని సూచించారు. ఎన్యూమరేషన్ ఫామ్ సమర్పించిన వారి వివరాలనే ముసాయిదా ఓటర్ల జాబితాలో ప్రచురిస్తారని పేర్కొన్నారు. అలాగే ఓటర్ల చేర్పులు, మార్పులు, తొలగింపులకు సంబంధించిన అభ్యంతరాలు, దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ నిర్వహించి తదుపరి నివేదికలు సిద్ధం చేయాలని బీఎల్‌వోలకు ఆదేశించినట్లు తెలిపారు. అర్హుల ఓట్లు పొరపాటున తొలగించబడకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. నగర పరిధిలో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కమిషనర్ వెల్లడించారు. ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్ఏలు, స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమానికి సహకరించి ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి

**సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నేత పి.టాన్య**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, ఉదారవాద విధానాల పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గంపై తీవ్ర దాడులు కొనసాగిస్తున్నాయని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు పి. టాన్య విమర్శించారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో నిర్వహించిన సార్వత్రిక సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ కార్మిక వ్యతిరేకమైనవని, కార్మికులు దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను హరించే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు. వాటిని వెంటనే రద్దు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరుస్తూ, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాలను ప్రోత్సహించడం వల్ల లక్షలాది మంది కార్మికులు ఉద్యోగ భద్రత కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు లేకపోవడం, కనీస వేతన చట్టాలు అమలు కాకపోవడం, కార్మిక సంక్షేమ చట్టాల ఉల్లంఘనపై ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. దేశవ్యాప్తంగా "సమాన పనికి సమాన వేతనం" సూత్రాన్ని అమలు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, అసంఘటిత రంగ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, పెన్షన్ తదితర సామాజిక భద్రతా పథకాలు కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. కార్మిక హక్కుల పరిరక్షణ కోసం కార్మిక వర్గం ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో చేపట్టనున్న ఉద్యమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు కె. సూరిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, నగర ప్రధాన కార్యదర్శి నందూరి సతీష్, నగర అధ్యక్షులు వి. రాజు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్,ఎం.రవణ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి టోర్నమెంట్లో రాజమండ్రి క్రీడాకారుల ప్రతిభ




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గత మూడు రోజులుగా పెద్దాపురం శ్రీ ప్రకాష్ సీనర్జీ టేబుల్ టెన్నిస్ అకాడమీలో జరుగుతున్న ఏపీ టేబుల్ టెన్నిస్ స్టేట్ ర్యాంకింగ్ టోర్నమెంట్ 2026లో రాజమహేంద్రవరంలో గల రాజమండ్రి గౌతమి టేబుల్ టెన్నిస్ అకాడమీ క్రీడాకారులు ఉత్తమ ప్రతిభను కనబరిచి బహుమతులు సాధించారు. అకాడమీ సీనియర్ క్రీడాకారులు ఛార్వి ఫల్గున్ మహిళల సింగిల్స్ వ్యక్తిగత విభాగంలో ద్వితీయ బహుమతిని సాధించి రన్నర్ అప్ గా నిలిచింది. అదేవిధంగా జి. సిరి పావని మహిళల సింగిల్స్ వ్యక్తిగత విభాగంలో సెమీఫైనల్స్ కు చేరి తృతీయ బహుమతిని సాధించింది. అకాడమీకు చెందిన మరొక క్రీడాకారుడు బుర సాయి జోషిత్ పురుషుల సింగిల్స్ వ్యక్తిగత విభాగంలో సెమీఫైనల్స్ కు చేరి తృతీయ బహుమతిని సాధించాడు. విజేతలకు శ్రీ ప్రకాష్ సినర్జీ స్కూల్ డైరెక్టర్ శ్రీ విజయ ప్రకాష్, పెద్దాపురం మాజీ మున్సిపల్ చైర్మన్, వెటరన్ నేషనల్ టెన్నిస్ ఛాంపియన్ రాజా సూరిబాబు, కాకినాడ అసోసియేషన్ సెక్రటరీ కె.మోహన్ బాబు బహుమతులు అందజేసినారు. ఈ ఘనత సాధించిన క్రీడాకారులను డిసిసి బ్యాంక్ మాజీ చైర్మన్ శ్రీ ఆకుల వీర్రాజు, అకాడమీ గౌరవ అధ్యక్షులు శ్రీ విశ్వనాథం భాస్కర రామ్, అధ్యక్షులు జెవివి అప్పారెడ్డి కోశాధికారి కె.సత్యనారాయణ(భీము), సెక్రటరీ అండ్ కోచ్ వి టి వి సుబ్బారావు, సురపురెడ్డి సూర్య ప్రకాష్ మరియు అనేకమంది అకాడమీ సభ్యులు అభినందించారు.

### ప్రేక్షకులను అలరించిన

## స్టార్ ఐకాన్ ఆఫ్ రాజమండ్రి ఫ్యాషన్ షో

**- మోడలింగ్ రంగంలో ఎన్నో అవకాశాలు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మోడలింగ్ రంగంలో రాణించిన వారికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని స్టార్ ఐకాన్ ఆఫ్ రాజమండ్రి ఫ్యాషన్ షో నిర్వాహకులు నవీన్ అన్నారు. ఏవీ అప్పారావు రోడ్ లోని ప్రసాద్ ఐ మాక్స్ ధియోటర్స్ లో ఏర్పాటు చేసిన స్టార్ ఐకాన్ ఆఫ్ రాజమండ్రి ఫ్యాషన్ షో ప్రేక్షకులను అలరించింది. గతవారం లాలా చెరువు,హైవే రోడ్డులో ఉన్న ప్రకృతి వేదిక లో నిర్వహించిన ఫ్యాషన్ షోలో గెలుపొందిన విజేతలు ఈ కార్యక్రమంలో పాల్గొని క్యాట్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్ దీప్, బిందు, ప్రియాంక , సంతోష్ కుమార్ మాట్లాడుతూ పోస్టర్ ఆవిష్కరణ దగ్గర నుంచి ఫ్యాషన్స్ నిర్వహించే వరకు ప్రకృతి వేదిక నిర్వాహకులు జీవి శ్రీరాజ్ కు ,ప్రసాద్ ఐమాక్స్ థియేటర్ నిర్వాహకులు కు కృతజ్ఞతలు తెలిపారు. ఫ్యాషన్ షో లలో పాల్గొనడం వలన టీవీ సీరియల్స్, వెబ్ సిరీస్ లలో అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఈ సందర్భంగా ఫ్యాషన్ షోలో గెలుపొందిన స్రవంతి మాట్లాడుతూ పెళ్లయిన తాను ఫ్యాషన్ షోలో పాల్గొనడం వల్ల ఆత్మవిశ్వాసం పెరిగిందని అన్నారు. అందం, టాలెంట్ ఉండడం వల్ల ఫ్యాషన్ రంగంలో అనేక అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రేయా మీడియా వారికి కృతజ్ఞతలు తెలిపారు.

### జూన్ 15న రాజమహేంద్రవరం విమానాశ్రయంలో

## 'యాత్రి సువిధా దివస్-2026'

**ప్రయాణికులకు ప్రత్యేక స్వాగతం, ఆరోగ్య శిబిరాలు, రక్తదాన కార్యక్రమం, మొక్కల పంపిణీ**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వం మరియు భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థ (ఏఏఐ) ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జూన్ 15న నిర్వహించే "యాత్రి సువిధా దివస్-2026" కార్యక్రమాన్ని రాజమహేంద్రవరం విమానాశ్రయంలో ఘనంగా నిర్వహించనున్నట్లు విమానాశ్రయ డైరెక్టర్ కె.ప్రీతి తెలిపారు. విమానయాన మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రయాణికులకు అందిస్తున్న సేవలు, సమాజాభివృద్ధిలో విమానాశ్రయాల పాత్రపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా విమానాశ్రయానికి వచ్చే ప్రయాణికులకు తిలకం దిద్ది గులాబీ పుష్పాలతో స్వాగతం పలకడం, టెర్మినల్ భవనం వద్ద భాగస్వామ్య సంస్థల ప్రతినిధులతో కలిసి "వందే మాతరం" గానం చేయడం, హౌస్‌కీపింగ్ సిబ్బందిని సత్కరించడం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అదేవిధంగా విమానాశ్రయ ప్రాంగణంలో మొక్కలు నాటడం, ప్రయాణికులకు మొక్కల పంపిణీ, ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరం (బీపీ, షుగర్, బీఎంఐ, ఈసీజీ, సీబీపీ పరీక్షలు), ప్రభుత్వ ఆసుపత్రి సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. టెర్మినల్ భవనంలో సెల్ఫీ పాయింట్ ఏర్పాటు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇంటర్న్‌షిప్ విద్యార్థులకు విమానయాన రంగంలో ఉపాధి అవకాశాలపై అవగాహన సదస్సు, చిన్నారుల కోసం చిత్రలేఖన పోటీలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. విమానయాన రంగంలో సేవలందిస్తున్న మహిళా ఉద్యోగులను సత్కరించడం, రాత్రి వేళల్లో టెర్మినల్ భవనాన్ని ప్రత్యేక విద్యుత్ దీపాలతో అలంకరించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు, ప్రజలు, విమానాశ్రయ భాగస్వామ్య సంస్థల ప్రతినిధులు ఈ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని విజయవంతం చేయాలని విమానాశ్రయ డైరెక్టర్ కె. ప్రీతి కోరారు.

## ఘనంగా శ్రీ లక్ష్మీ కుబేర సుదర్శన హోమం

**దేశంలోనే తొలిసారిగా వాహనంతో కూడుకున్న మహాలక్ష్మి హోమం**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పంచ పర్వములలో మహా పర్వమైనటువంటి అమావాస్య రోజున శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రం ప్రాంగణంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద అధిక జేష్ఠ మాసములో అత్యంత విశేషమైన ప్రయుక్త శ్రీ లక్ష్మీ కుబేర సుదర్శన హోమం జరిగింది. అమావాస్య ఆదివారం రావడంతో మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.భారతదేశంలోని మొట్టమొదటి సారిగా వాహనంతో కూడుకున్న మహాలక్ష్మి హోమం జరగడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. బ్రహ్మశ్రీ బోడెం నాగ సత్య రవికుమార్ శర్మ ఆధ్వర్యంలో పండిత పురోహితుల చేతుల మీదుగా ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. దర్శ (అమావాస్య) రోజున చేసే శ్రీ లక్ష్మీ కుబేర సుదర్శన హోమం చాలా పవిత్రమైనదని, ఈ హోమం వలన సంపద, ఆర్థిక స్థిరత్వం, రక్షణ కోసం చేసే ఒక శక్తివంతమైన పూజా విధానమని,దీని ద్వారా లక్ష్మీదేవి, కుబేరుడు, సుదర్శన చక్రం (విష్ణుమూర్తి) యొక్క అనుగ్రహం కలుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, మాజీ కార్పొరేటర్ వాకచర్ల కృష్ణ ,ఉమా మార్కండేయ లలితా మండలి సభ్యులు పాల్గొన్నారు.పూజ కార్యక్రమాల నిమిత్తం ఆసక్తి కలవారు బోడెం నాగ సత్య రవికుమార్ శర్మ 9908798988 నెంబర్ కు సంప్రదించాలన్నారు. ప్రతి నెల అమావాస్య రోజున ఈ కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు.

## సమాజ సేవలో యువత పాత్ర ఎంత ముఖ్యం

**ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల ఎన్ఎస్ఎస్, యువజన రెడ్‌క్రాస్ (వైఎఆర్‌సి) వాలంటీర్లు, రాజమహేంద్రవరం రివర్ సిటీ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు.యువత వారి చురుకైన భాగస్వామ్యం సమాజ సేవ పట్ల, ప్రాణాలను కాపాడాలనే వారి నిబద్ధతను ప్రతిబింబించింది. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పోలుకొండ సాయి 11వ సారి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. ప్రోగ్రామ్ ఆఫీసర్లు డా. జి.వి.ఎస్. నాగేశ్వరరావు, పోలుకొండ సాయి, బి. విమల మరియు డా. బి.హెచ్.వి. రామదేవి వాలంటీర్ల సేవా దృక్పథాన్ని అభినందించారు. ఎన్ ఎస్ ఎస్ ,యువజన రెడ్‌క్రాస్ వాలంటీర్ల సేవలను ప్రశంసిస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ప్రోత్సహించారు.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమం స్వచ్ఛంద రక్తదానం యొక్క ప్రాముఖ్యతను తెలియజేయడంతో పాటు, సమాజ సేవలో యువత పాత్ర ఎంత ముఖ్యమో చాటిచెప్పింది.

## ఘనంగా తెలుగు శిక్షణ ముగింపోత్సవం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** విఖ్యాత నాట్య పండితులు డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్ గత 22 సంవత్సరాలుగా ప్రతి వేసవిలో చిన్నారులకు ఉచితంగా తెలుగు భాష చిత్రలేఖనం లో శిక్షణ ఇస్తూ శిక్షణ పొందిన చిన్నారులకు ప్రశంస పత్రాలను, జ్ఞాపికలను, పెద్దబాలశిక్ష పుస్తకాలను అందిస్తున్నారు. అందులో భాగంగా ఈ ఏడాది కూడా తెలుగు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి ముగింపు ఉత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సప్పా దుర్గాప్రసాద్ తో తనకు 40 సంవత్సరాల అనుబంధం ఉందని, తెలుగు భాషలో శిక్షణ ఇస్తున్న భారతవనిలోని ఏకైక వ్యక్తి దుర్గాప్రసాద్ రాజమండ్రి నగరానికి చెందిన వారు కావడం అదృష్టం అన్నారు. తెలుగు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగు విశ్వవిద్యాలయం ఖ్యాతి, విశిష్టత ప్రపంచానికి తెలియజేయాలని దుర్గాప్రసాద్ తెలుగు భాష శిక్షణ నిర్వహిస్తున్నారని, శిక్షణకు తమ విద్యాలయం పేరును కలిపారని, విద్యాలయం యొక్క ఆశయాలు అభివృద్ధి కోర్సుల వివరాలు తెలుగు భాషా విశిష్టతను ఆయన తెలిపారు. మరో అతిథి జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ తెలుగు భాష ఆవశ్యకత కోసం తెలుగు భాష బ్రహ్మోత్సవాలు నిర్వహణలో సప్పా దుర్గాప్రసాద్ పాత్ర ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య గంగిరెడ్డి, ప్రొఫెసర్ డాక్టర్ పలివెల హరినాథ్, ఉమర్ అలీషా పీఠం ప్రతినిధి డి.కృష్ణంరాజు, పివిఎన్ఎస్ మూర్తి, మాజీ ఎంపీ జీవీ హర్ష కుమార్, జీ. సరళ కుమారి తదితరులు ప్రసంగించి సప్పా సేవలను కొనియాడారు. అనంతరం ఆదిత్య కళాశాలల పక్షాన సప్పా దుర్గాప్రసాద్ ను ఘనంగా సన్మానించారు. శిక్షణ పొందిన చిన్నారులకు జ్ఞాపికలు, ప్రశంస పత్రాలను, పెద్దబాలశిక్ష, భగవద్గీతలను అతిథుల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమ నిర్వహణను డాక్టర్ పివిబి సంజీవరావు నిర్వహించగా వందన సమర్పణ సప్పా జయ శివదుర్గజాహ్నవి చేసారు.

## పవిత్ర గోదావరిని దుర్భరస్థితికి తీసుకురాకండి

**స్విమర్స్ క్లబ్ ఆధ్వర్యంలో పుష్కర్ ఘాటులో గోదావరి ప్రక్షాళన**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మానవజాతికి జీవనాధారమైన పవిత్ర గోదావరి నదిని దుర్భర స్థితికి ప్రజలు తీసుకురావడం విచారకరమని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ సిజీసీ సభ్యులు, గోదావరి స్విమ్మర్స్ క్లబ్ గౌరవ అధ్యక్షులు రౌతు సూర్య ప్రకాశరావు ఆవేదన వ్యక్తం చేశారు.గోదావరి స్విమ్మర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పుష్కర్ ఘాట్ వద్ద గోదావరిలో ఉన్న వ్యర్థాలను తొలగించే కార్యక్రమానికి మరోసారి శ్రీకారం చుట్టారు. సభ్యులు పడవల సాయంతో గోదావరి అడుగుభాగంలో ఉన్న నాచు, ఇతర వ్యర్థాలను తొలగించి గట్టుపైకి చేర్చారు.సాగునీటికి, తాగు నీటికి ఆధారమైన గోదావరి నదిని డస్ట్ బిన్ లా మార్చేసారని ఆవేదన వ్యక్తం చేశారు. తమవంతుగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్న బాధ్యత, నది జలాలను పరిరక్షించాలన్న లక్ష్యంతో గోదావరి స్విమర్స్ క్లబ్ తరపున తరచుగా ఈ ప్రక్షాళన కార్యక్రమాన్ని చేపడుతున్నామని ఆయన తెలిపారు. ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన రాజమండ్రి పుష్కర్ ఘాటులో చెత్త పేరుకుపోతుండడం బాధాకరంగా ఉందని ఆయన అన్నారు. కొన్ని పూజా కార్యక్రమాల తర్వాత తీసివేసిన వ్యర్థాలను గోదావరిలో పడవేసి నదీ జలాలను కాలుష్యం బారిన పడవేయవద్దని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో గోదావరి స్లిమర్స్ క్లబ్ అధ్యక్షులు గుబ్బల వెంకటరమణ, సెక్రటరీ పాలపర్తి దుర్గాప్రసాద్, మాజీ అధ్యక్షులు యర్రా వెంకట రంగనాయకులు, వైఎస్ఆర్ శ్రీను, కుక్క తాతబ్బాయి, గ్లోబల్ కిషోర్, గుప్తా, లాయర్ నాగేశ్వరరావు, రామారావు( బ్యాంక్), ఎలక్ట్రికల్ ప్రసాద్, టైలర్ లక్ష్మణరావు, ఎల్లయ్య నాయుడు, క్లబ్ సభ్యులు, వాసు, గుమస్తాలు రాజు, జాగు బాబురావు, చేపల రాజు, విష్ణు, సత్తిబాబు, నాగేశ్వర రావు, రవీంద్ర , ప్రసాద్, రత్నాజీ,మట్టా జానకి రామయ్య తదితరులు పాల్గొన్నారు.



## మాట నిలబెట్టుకున్న విజయ్ దేవరకొండ..

### భార్యతో కలిసి నాగర్ కర్నూల్ జిల్లా తుమ్మన్‌పేటకు



వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టిన తర్వాత హీరో విజయ్ దేవరకొండ తన సతీమణి రష్మిక మందన్న, కుటుంబ సభ్యులతో కలిసి సొంత ఊరు తుమ్మన్ పేటకు వెళ్లారు. అప్పుడు అచ్చం పేట డివిజన్ లో ఉన్న 44 ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 9, 10వ తరగతి విద్యార్థులకు విజయ్ దేవరకొండ ఛారిటబుల్ ట్రస్ట్ తరుపున స్కాలర్ షిప్స్ అందిస్తాం అని మాట ఇచ్చారు. స్టార్ హీరో విజయ్ దేవరకొండ, అందాల భామ రష్మిక మందన్న ఇటీవలే పెళ్లి చేసుకొని ఒక్కటైన విషయం తెలిసిందే. చాలా కాలంగా ప్రేమలో ఉన్న ఈ ఇద్దరూ వివాహబంధంతో ఒక్కటయ్యారు. ఇక ఈ ఇద్దరూ పెళ్లి తర్వాత ఎవరి సినిమాలతో వారు ఫుల్ బిజీగా ఉన్నారు. హీరో విజయ్ దేవరకొండ సినిమాలతో పాటు పలు సామజిక సేవ కార్యక్రమాలతో ఎంతో మందికి సాయం చేస్తున్నారు. తాజాగా నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేటలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్కాలర్ షిప్స్ అందిస్తున్నారు విజయ్ దేవరకొండ-రష్మిక. ఈ ఏడాది ప్రారంభంలో.. పెళ్లి చేసుకున్న తర్వాత.. విజయ్ దేవరకొండ సొంతూరైన నాగర్ కర్నూల్ జిల్లా తుమ్మన్‌పేట గ్రామాన్ని సందర్శించారు. ఆ సందర్భంగా.. అచ్చంపేట డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల టాపర్లకు స్కాలర్‌షిప్స్ అందిస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీని నిలబెట్టుకుంటూ ది దేవరకొండ ఫౌండేషన్ ద్వారా.. 44 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు స్వయంగా స్కాలర్‌షిప్స్ అందించారు విజయ్ దేవరకొండ-రష్మిక. 9, 10వ తరగతుల్లో.. 180 మంది ప్రతిభావంతులకు సహాయం చేశారు. గురువులు, తల్లిదండ్రులు చెప్పిన మాటలు వింటూ విద్యార్థులు ఉన్నత శిఖరాలు అదిరోహించాలని ఆకాంక్షించారు. ఆ మాటను నిలబెట్టుకుంటూ నేడు (జూన్ 14) విజయ్ దేవరకొండ తన భార్యతో కలిసి తన తండ్రి జన్మస్థలమైన నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట నియోజకవర్గంలోని తుమ్మన్‌పేట గ్రామానికి వెళ్లారు విజయ్. సొంతూరికి వచ్చిన ఈ కొత్త దంపతులకు గ్రామస్థులు ఘనస్వాగతం పలకనున్నారు. అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని 44 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 9, 10 తరగతుల విద్యార్థుల కోసం స్కాలర్‌షిప్ అందించనున్నారు విజయ్ రష్మిక. ది దేవరకొండ ఫౌండేషన్ ద్వారా విద్యార్థుల ఉన్నత చదువుకు అవసరమైన ఖర్చును అందించనున్నారు విజయ్, రష్మిక.

## అవకాశాలు ఫుల్లు హిట్లు మాత్రం నిల్లు..

### సాలిడ్ సక్సెస్ కోసం ఎదురుచూస్తున్న శ్రీలీల

అందాల భామ శ్రీలీల.. తెలుగు సినీప్రియులకు పరిచయం అక్కర్లేనిపేరు. చేసింది తక్కువ సినిమాలే అయిన విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది ఈ అందాల భామ. తెలుగులో పెళ్లి సందణ సినిమాతో కథానాయికగా ఎంట్రీ ఇచ్చిన ఈ ముద్దుగుమ్మ.. తొలి సినిమాతోనే అందరి దృష్టిని ఆకర్షించింది. అందాల భామ శ్రీలీల.. తెలుగు సినీప్రియులకు పరిచయం అక్కర్లేనిపేరు. చేసింది తక్కువ సినిమాలే అయిన విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది ఈ అందాల భామ. తెలుగులో పెళ్లి సందణ సినిమాతో కథానాయికగా ఎంట్రీ ఇచ్చిన ఈ ముద్దుగుమ్మ.. తొలి సినిమాతోనే అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ తర్వాత ధమాకా సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఈ సినిమాలో తన నటనతో ఆకట్టుకుంది శ్రీలీల. ఈ మూవీ తర్వాత తెలుగులో శ్రీలీలకు వరుస ఆఫర్స్ క్యూ కట్టాయి. ధమాకా సినిమా తర్వాత అనేక ప్రాజెక్ట్స్ చేసినప్పటికీ ఆ స్థాయిలో హిట్టు మాత్రం రాలేదు. కానీ వరుసగా ఆఫర్స్ మాత్రం అందుకుంటుంది. అందం, అభినయంతోపాటు ఎనర్జిటిక్ డ్యాన్స్ తో ఆకట్టుకుంది. దీంతో తెలుగులో వరుస అవకాశాలు అందిపుచ్చుకుంది. ఓవైపు స్టార్ హీరోలకు జోడిగా నటిస్తూనే.. మరోవైపు కుర్రహీరోలస సరసన నటించింది. అయితే కొన్నాళ్లుగా ఈ బ్యూటీ నటించిన చిత్రాలు తెలుగులో ఫ్లాప్ అవుతున్నాయి. దీంతో ఇప్పుడు ఈ బ్యూటీ సరైన బ్రేక్ కోసం వెయిట్ చేస్తుంది. అయితే వరుసగా ఫ్లాపులు వస్తున్నప్పటికీ శ్రీలీల డిమాండ్ మాత్రం తగ్గడం లేదు. ఇటీవలే పరాశక్తి సినిమాతో కోలీవుడ్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. శివకార్తికేయన్ హీరోగా నటించిన ఈ సినిమా కూడా ఫ్లాప్ అయ్యింది. తెలుగులో ఈ అమ్మడు ఇప్పటివరకు పది సినిమాల్లో నటించింది. వాటిలో హిట్ అయినవి రెండే రెండు సినిమాలు అందులో ఒకటి ధమాకా అయితే మరొకటి భగవంత్ కేసరి సినిమా.. అయితే భగవంత్ కేసరి సినిమా బాలయ్య ఖాతాలోకి వెళ్ళిపోయింది. ఇటీవలే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలో నటించింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా కూడా ఫ్లాప్ అయ్యింది. దాంతో ఈ అమ్మడికి తెలుగులో ఆఫర్స్ తగ్గాయి. ప్రస్తుతం శ్రీలీల అవకాశాల కోసం ఎదురుచూస్తుంది. ఇక సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ అభిమానులను ఆకట్టుకుంది. రెగ్యులర్ గా ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది శ్రీలీల. ఈ చిన్నదాని ఫోటోలకు ఫిదా అవుతున్నారు కుర్రకారు.



## దీప్తి పాంచ్ పటాకా.. పాక్‌పై భారత్ ఘనవిజయం..

### ప్రపంచకప్‌లో టీమిండియా బోణీ..!

ప్రపంచకప్ లాంటి ప్రతిష్టాత్మక వేదికపై పాకిస్తాన్‌ను భారీ తేడాతో ఓడించడం ద్వారా భారత మహిళల జట్టు తమ ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసుకుంది. దీప్తి శర్మ ఐదు వికెట్ల అద్భుత ప్రదర్శన, జట్టు ఉమ్మడి కృషి రాబోయే మ్యాచ్‌లలో భారత్‌ను మరింత పటిష్టంగా మార్చనుంది. ఇదే ఫామ్‌ను కొనసాగిస్తూ టీమిండియా ప్రపంచకప్ ట్రోఫీ వైపు అడుగులు వేయాలని అభిమానులు కోరుకుంటున్నారు. మహిళల టి20 ప్రపంచకప్‌లో యావత్ క్రికెట్ ప్రపంచం ఎంతో ఉత్కంఠగా ఎదురుచూసిన భారత్, పాకిస్తాన్ మహాసమరంలో టీమిండియా ఘనవిజయం సాధించింది. చిరకాల ప్రత్యర్థిపై ఆల్ రౌండ్ ప్రదర్శన కనబరిచిన భారత మహిళల జట్టు 64 పరుగుల తేడాతో పాకిస్తాన్‌ను చిత్తు చేసి, ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో తమ విజయయాత్రను ఘనంగా ప్రారంభించింది.

**భారత బౌలర్ల ధాటికి పాక్ తలవంచక తప్పలే..!**

ఈ హై-వోల్టేజ్ పోరులో మొదట బ్యాటింగ్ చేసిన భారత జట్టు ప్రత్యర్థి ముందు భారీ లక్ష్యాన్ని ఉంచింది. అనంతరం కొండంత లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్తాన్ జట్టుకు భారత బౌలర్లు మొదటి ఓవర్ నుంచే చుక్కలు చూపించారు. భారత పేసర్లు, స్పిన్నర్లు కలిసికట్టుగా అటాక్ చేయడంతో పాక్ బ్యాటర్లు క్రీజులో నిలదొక్కుకునేందుకు తీవ్రంగా శ్రమించారు. పరుగుల వేగాన్ని పెంచే క్రమంలో ఒకరి తర్వాత ఒకరు పెవిలియన్‌కు క్యూ కట్టారు. భారత ఫీల్డర్లు కూడా అద్భుతమైన క్యాచ్‌లతో బౌలర్లకు పూర్తి అండగా నిలిచారు.

భారత స్పిన్ మాంత్రికురాలు దీప్తి శర్మ ఈ మ్యాచ్‌లో పాకిస్తాన్ పతనాన్ని శాసించింది. తన అద్భుతమైన లైన్ అండ్ లెంగ్త్‌తో పాక్ బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టిన దీప్తి, ఏకంగా ఐదు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి జట్టు నడుం విరిచింది. దీప్తి శర్మ తన 4 ఓవర్ల కోటాలో కేవలం 10 పరుగులు మాత్రమే ఇచ్చి 5 వికెట్లు పడగొట్టడం విశేషం. ముఖ్యంగా ఆమె వేసిన 17వ ఓవర్ మ్యాచ్‌ను ఏకపక్షంగా మార్చేసింది. ఆ ఓవర్లో కేవలం 2 పరుగులు మాత్రమే ఇచ్చి మూడు వికెట్లు కూల్చడంతో పాక్ కథ ముగిసింది.



**106 పరుగులకే కుప్పకూలిన పాకిస్తాన్..**

భారత బౌలర్ల ధాటికి పాకిస్తాన్ మహిళల జట్టు 17 ఓవర్లలోనే కేవలం 106 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులో నష్రా సంధు 5 బంతుల్లో 4 పరుగులు చేసి చివరి వికెట్‌గా వెనుదిరగగా, సాదియా ఇక్బాల్ 1 పరుగుతో అజేయంగా నిలిచింది. ఇరు జట్ల మధ్య జరిగిన ఈ ఆరో టి20 మ్యాచ్‌లో భారత్ అన్ని విభాగాల్లోనూ పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. బ్యాటింగ్‌లో పరుగుల సునామీ సృష్టించిన టీమిండియా, బౌలింగ్‌లోనూ అదే దూకుడు చూపిస్తూ పాక్‌పై భారీ విజయాన్ని నమోదు చేసింది.

## ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-3.. నాలుగేళ్ల తర్వాత భారత్‌కు స్వర్ణం

ఇంటర్నెట్ డెస్క్: ఆర్చరీ ప్రపంచ కప్ స్టేజ్ -3 రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో భారత్ స్వర్ణం గెలుచుకుంది. ఫైనల్‌లో ఒలింపిక్ ఛాంపియన్స్ దక్షిణ కొరియాను భారత ఆర్చర్లు ధీరజ్ బొమ్మదేవర - కుంకుమ్ మొహోద్ జోడీ ఓడించింది. ఓహ్ యే-జిన్, కిమ్ జె-డివోక్‌పై 5-1 తేడాతో అద్భుత విజయం సాధించింది. తొలి రెండు రౌండ్లలో 37-36, 37-36తో భారత్‌దే ఆధిపత్యం. ఇక మూడో రౌండ్‌లోనూ పోటాపోటీగా జరిగినా.. 39-39తో ఇరు జట్లూ సమంగా నిలిచాయి. దీంతో భారత్ విజేతగా అవతరించింది. ఇక మిక్స్‌డ్ ఈవెంట్‌లో ధీరజ్ - కుంకుమ్‌కు ఇదే తొలి వరల్డ్ కప్ గోల్డ్ మెడల్ కావడం గమనార్హం. ఇక నాలుగేళ్ల తర్వాత భారత్ వరల్డ్ కప్ స్టేజ్‌లో ఈ విభాగంలో బంగారు పతకం సాధించింది. చివరిసారిగా 2022 ఈవెంట్‌లో రిధి ఫోర్ - తరుణ్‌దీప్ రాయ్ జోడీ గోల్డ్‌ను గెలుచుకుంది. సింగిల్స్‌లోనూ ధీరజ్ సెమీస్‌కు చేరిన సంగతి తెలిసిందే. ఫైనల్లో చోటు కోసం అతడు మారిట్జ్ వీజర్ (జర్మనీ)తో నేడు తలపడనున్నాడు. ఇందులోనూ గెలిస్తే.. కచ్చితంగా గోల్డ్ లేదా సిల్వర్ మెడల్ ఖాయమవుతుంది.



విశ్వం వాయిస్ తెలుగు దినపత్రికలో వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com